honeybee.org
Vol-9 Issue-5

సంపుటి 9 సంచిక 5 జులై - ఆగస్ట్ 2021


# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక



# 'ఒక్క దారం ముక్క కూడా వృధా పోకూడదు' అన్న తత్వం



నా చిన్నతనంలో నేను పాత ఢిల్లీలోని 'దరియా గంజ్'లో మా అమ్మమ్మ, తాతయ్యలతో వుండేవాడిని. మా కుటుంబం చాలా పెద్దదే అయినా, మాది మాత్రం రెండు గదులు వున్న చిన్న ఇల్లు. ఆ రోజుల్లో ప్లాస్టిక్ అంటే ఏమిటో మాకు తెలియదు. దాని వాడకం లేనే లేదు. చాలా మటుకు కవర్లు పాత వార్తా పత్రికలతో చేసేవాళ్ళు. నేను కూడా అవసరం అయినపుడు పాత పేపర్లతో కవర్లు తయారు చేసేవాడిని. మాకు దగ్గర్లో వున్న కిరాణా దుకాణం దారుడు పెద్ద మొత్తంలో కొంటేనే పేపర్ కవర్లలో ఇచ్చేవాడు. చిన్న మొత్తాల్లో సరుకులు కొన్నపుడు కవర్లు ఇచ్చేవాళ్ళు కాదు. ఒకసారి నన్ను, మా మామయ్య (ఆయనదీ దాదాపు నా వయసే) లని దుకాణం నుంచి ఏదో సరుకు తెమ్మని పంపారు. అక్కడ దుకాణంలో పైనుంచి వెలాడుతున్న కొంకీకి ఒక దారం వుండ వుండేది. అతని పక్కనే చించి, చిన్న ముక్కలుగా చేసిన వార్తా పత్రికల దొంతర వుండేది. చిన్న మొత్తాల్లో సరుకులు కొన్నవాళ్ళకి ఆ సరుకులని ఒక కాగితంలో కట్టి, దానికి కొంచెం దారం చుట్టి చిన్న ప్యాకెట్‌గా చేసి ఇచ్చేవాడు. మేమూ అలాగే మా సరుకు చిన్న ప్యాకెట్ రూపంలో ఇంటికి తెచ్చాము. తాతయ్య ఆ ప్యాకెట్‌కు వున్న దారం జాగ్రత్తగా విప్పి, మళ్ళీ వాడటం కోసం ఒక చుట్టగా చుట్టి మూలకొన్న కొయ్యకి తగిలించాడు. కొన్న సరుకు అమ్మమ్మకు ఇచ్చేసి ఆ కాగితాన్ని సాపు చేసి మంచం మీద వున్న పరుపు క్రింద పరిచి పెట్టేవాడు. "ఎందుకు?" అని అడిగితే "మళ్ళీ మనము ఎవరికైనా ఏమైనా ఇవ్వాల్సి వచ్చినపుడు ఇదే కాగితంలో చుట్టి, దారంతో కట్టి ఇవ్వడానికి ఉపయోగ పడతాయి కదా!" అన్నారు. అప్పుడు పూర్తిగా తెలియక పోయినా, ఇప్పుడనిపిస్తుంది... 'పూచిక పుల్ల కూడా వృధా చేయకూడదు' అనటం, 'దారపు పోగు కూడా పనికి వస్తుంది' అనటం.... కేవలం అనటం కాదు, అదొక జీవన విధానం.

పైన చెప్పిన దాంతో పోలిస్తే అండమాన్ ద్వీపానికి చెందిన 'నివేదిత' అనే పాఠశాల విద్యార్థిని తన అధ్యాపకుడు శ్రీ చంచల్ రాయ్ గారి పర్యవేక్షణలో వేసిన పైనున్న బొమ్మ చూస్తే ప్రస్తుత పరిస్థితి అర్థమవుతుంది. ఆ అమ్మాయి మనకు ఏమి చెప్పాలనుకుంటోంది? మనలో కొత్తగా పుట్టుకు వచ్చిన విశృంఖల ప్లాస్టిక్ వాడకం అలవాటు ఎంత ప్రమాదానికి దారి తీస్తున్నదో చెప్పకనే చెప్పినట్టు లేదూ? ప్లాస్టిక్ గుట్ట మధ్యలో వున్న చిన్ని చెట్టు సమస్య పరిష్కారానికి మార్గం దొరకాలి అన్న ఆశ చివురింప జేస్తున్నట్టుగా లేదూ?

– హనీబీ 29(2&3) ఏప్రిల్ – సెప్టెంబర్ 2018

సంపుటి-9 సంచిక - 5 జూలై - ఆగస్ట్ 2021

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

కార్టూన్స్ : **వెంకటి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 1,000/-**
**for 5 years Subscription**

## ఈ సంచికలో.....


* యంత్రాలతో చెగోడీలు, చెక్కలు, వేరుశనగ పప్పు తయారీ
నిరుద్యోగులకు 'జ్యోతుల జస్వంత్' ముచ్చటైన పరిష్కారం - 4

* కలుపు నివారణకు రైతుల సృజనాత్మక ఆలోచనలు -
పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన చేతి పరికరాలు - 6

* నారు నాటడం, విత్తనం వేసే ఖర్చును గణనీయంగా తగ్గించిన
గోవర్ధన్ దాస్ ట్రాక్టర్ అనుసంధాన పరికరం - 8

* 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు - 10

* గ్రామీణ యువత స్వయం ఉపాధే లక్ష్యంగా 'పునాది స్థాయి ఇన్నోవేషన్లు' - 13

* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 18

* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 21

* వృక్షాయుర్వేదము - 24

* క్లిష్టమైన ఇంజనీరింగ్ పనులను సునాయాసం చేసిన
అ(తి)సామాన్యుడు "మురళీ కృష్ణుడు" - 26

* ఆయుర్వేద జ్ఞాన మథనం
గాల్ బ్లాడర్ లో రాళ్ళ నిర్మూలన, 'సి' విటమిన్ ప్రాధాన్యత - 30

* స్పందన - 31


<u>కవర్ లోపలి పేజీల్లో ...</u>

'ఒక్క దారం ముక్క కూడా వృధా పోకూడదు' అన్న తత్వం- హనీబీ కథ
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

<u>మధ్య పేజీలో :</u>

'ఇంటింటా ఇన్నోవేటర్' పురస్కారాలు అందుకున్న "పల్లెసృజన ఇన్నోవేటర్లు"

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank,
Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar, Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# చిన్న శోధయాత్ర - గ్రామ సత్యాలు

పల్లెసృజన జ్ఞానం సేకరించడానికి, సేకరించిన జ్ఞానాన్ని విస్తరింప జేయటానికి చేసే ఒక ప్రధానమైన కార్యక్రమం "చిన్న శోధయాత్ర". హనీబీ నెట్‌వర్క్, అహమ్మదాబాద్ శోధయాత్రలను 1995లో పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అనిల్ గుప్తా ప్రారంభించారు. ఇది దేశంలోని మూల మూల ప్రాంతాలలో సంవత్సరానికి రెండు నుండి నాలుగు సార్లు ఏడు రోజుల పాటు నిర్వహింప బడుతుంది. జాతీయ స్థాయిలో జరిగే ఈ యాత్రలే స్ఫూర్తిగా తెలుగు రాష్ట్రాల్లో సంవత్సరానికి నాలుగు సార్లు పల్లెసృజన సంస్థ "చిన్న శోధయాత్ర" పేరిట నిర్వహిస్తున్నది. ఈ యాత్రలో శోధయాత్రీకులు మూడు రోజుల పాటు, 55 – 60 కి.మీ. నడుస్తూ ప్రకృతి, ప్రజలతో మమేకమై పల్లెజ్ఞానాన్ని నేర్చుకుంటారు. కొత్త ఇన్నోవేటర్లను వెతుకుతారు. గ్రామ ప్రజలు అనుభవిస్తున్న సమస్యల గురించి కూలంకషంగా చర్చిస్తారు. స్కూలు పిల్లల క్రియాశీలతను వెలికి తీసేలా వారిని ప్రోత్సహిస్తారు. స్త్రీలు, వృద్ధులతో మాట్లాడుతారు. తొంభై ఏళ్ళకంటే ఎక్కువ వయసున్న పెద్దవారిని కలిసి వారితో సంభాషిస్తారు. పెద్దవారు చనిపోతే ఒక గ్రంథాలయం కాలిపోయినంత నష్టం సమాజానికి కలుగుతుందన్న "పల్లెసృజన" విశ్వాసానికి అనుగుణంగా, వారి జ్ఞానాన్ని సేకరించడానికి గ్రామాల్లోని పెద్దవాళ్ళతో సమయం గడుపుతారు. వారిని సత్కరించి, ఆశీర్వాదాలు తీసుకుంటారు. ఈ యాత్రల్లో జ్ఞాన సేకరణ అన్నది సమావేశాల పద్ధతిలో కాకుండా, గ్రామ ప్రజలతో యాత్రీకులు వ్యక్తిగతంగా వారి ఇంట్లో కానీ, పొలాల్లో కానీ కలిసి, వారి అనుమతితో వారి పనికి ఇబ్బంది కలగకుండా వారితో సంభాషిస్తూ సేకరిస్తారు. ఇలా దాదాపు 50 మంది యాత్రీకులు ప్రతి చిన్న శోధయాత్రలో పాల్గొని పల్లెల్లోని జ్ఞానాన్ని సేకరిస్తారు. ప్రకృతి, ప్రజల మధ్య ఉన్న అద్భుతమైన సంబధాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. గ్రామాల్లోని వ్యవసాయ వైవిధ్యము, నీటి వసతి, పంట రకాలు, యంత్రాల ఉపయోగం, వ్యవసాయ విధానాలు, పంటను మార్కెట్‌కు తరళించే విధానాలు, ప్రస్తుత వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థ, గ్రామ పాఠశాలలు, లింగ వివక్ష, సాంప్రదాయ వైద్యం, పశు వైద్యం, గ్రామ స్వచ్ఛత, ఆరోగ్య స్థితి, రవాణా సౌకర్యాలు, గ్రామ జీవన విధానాలు, స్థానిక కళలు, అసామాన్య యువకులు, ఇవన్నీ యాత్రీకులు చిన్న శోధయాత్రలో సేకరించడానికి పూర్తిగా ప్రయత్నం చేస్తారు. 2011లో ప్రారంభమైన ఈ చిన్న శోధయాత్రలు పల్లెసృజన ఆధ్వర్యంలో ఇంతవరకు 37 నిర్వహించబడ్డాయి. దాదాపు వెయ్యిమంది యాత్రీకులు ఈ యాత్రల్లో పాల్గొని, 500 కు పైగా గ్రామాలను సందర్శించారు. 30 వేల మంది గ్రామస్తులతో చర్చలు జరిపి పల్లె జ్ఞానాన్ని సేకరించారు. వందకు మించి దేశ వ్యాప్తంగా వున్న గ్రామాల ఇన్నోవేషన్లను స్థానికులకు పరిచయం చేశారు. అదే క్రమంలో దాదాపు వందకు పైగా ఇన్నోవేటర్లను ఈ యాత్రల్లో గుర్తించారు. ఈ యాత్రల వల్ల సమాజానికి ఎంత ఉపయోగమో పూర్తిగా అంచనా వేయలేమేమో కాని యాత్రీకులు మాత్రం ఎనలేని జ్ఞానాన్ని పొందగలిగారు. అదే చిన్నశోధయాత్ర ముఖ్య ఉద్దేశ్యం కూడా.



ఈ యాత్రల్లో గమనించిన ప్రధానాంశాలు కొన్ని చర్చించుకుందాం. ఎక్కడైతే నీళ్ళు పుష్కలంగా ఉన్నాయో అక్కడ ఎక్కువగా వరి మాత్రమే రెండు పంటలు వేస్తున్నారు. నీటి కాలువలు విరివిగా ఉన్న ఏ ప్రాంతమైనా తెలుగు రాష్ట్రాలలో ఒకటే పంట వేయడం ఒక ఆనవాయితీ అయ్యింది. కాలువలు రాకముందు అక్కడ అన్ని రకాల పంటలు వేసేవారని గ్రామాల్లోని వృద్ధులు యాత్రీకులకు వివరించారు.

వ్యవసాయ రంగంలో యంత్రాలు రావటం వలన పశువుల వాడకంతో పాటు

మనుషులు పని చేయటం కూడా చాలా వరకు తగ్గింది. యంత్రాలు అందరికి అందుబాటు ధరల్లో లేకున్నా, వాటిని సేకరించి, ఉపయోగించటం భారమైనా, చిన్న సన్నకారు రైతులు కూడా తప్పనిసరియై చేయాల్సి వస్తోంది. పర్యవసానంగా పశువుల పెంపకం భారంగా మారి, మెల్లి మెల్లిగా వాటి సంఖ్య గ్రామాల్లో తగ్గుతూ వస్తోంది.

విత్తనాలు దాదాపు రైతులందరూ కొంటున్నారు. ఎరువులు, మందులు, బయటనుంచే వస్తున్నాయి. యంత్రాలకు, వ్యవసాయ కూలీలకు ఖర్చు పెరుగుతున్నది. వీటన్నిటికీ కావలసిన నగదు 85% రైతుల (సన్న, చిన్నకారు) వద్ద లేదు. వీరంతా అప్పులు చేస్తూ వ్యవసాయం చేస్తున్నారు. ఇలాంటి రైతుల బలహీనతలను సంపూర్తిగా వాడుకోవడానికి ఎరువులు, మందులు అమ్మేవారు, మిల్లర్లు, ఊళ్ళోని సాహుకార్లు (అప్పు ఇచ్చేవారు) ఎక్కువవుతున్నారు.

పంట పండటం ఒక ఎత్తు, ఇది రైతుల ప్రాథమిక ఆదాయం. కాని వరి గింజలలో, పండ్లతో, పూలతో తాము అప్పుగా తీసుకొని పెట్టిన ఖర్చును తీర్చలేరు. పంట మార్కెట్‌కు వెళ్లాలి, అమ్మకం కావాలి. అప్పుడే రైతు చేతికి డబ్బు వస్తుంది. అంటే పట్టణాల్లో పనిచేసే వారందరికి ప్రాథమిక ఆదాయం డబ్బు అయితే, రైతుకు మాత్రం అది సెకండరీ ఆదాయం. పండిన పంటకు సరియైన ధర, కష్టానికి ఫలితం రైతులకు సరిగ్గా అందటం లేదన్న విషయం అందరికీ విదితమే. అందుకే మార్కెటింగ్ వ్యవస్థ రైతుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందేమో అన్న అనుమానం యాత్రీకులకు కలిగింది.

గత రెండుమూడు దశాబ్దాలలో వచ్చిన ఆధునిక వ్యవసాయ విజ్ఞానం వల్ల గ్రామస్తులు మెల్లి మెల్లిగా సాంప్రదాయ పద్ధతులకు దూరం కావటం, స్వయంగా చేసుకునే అలవాట్లు తగ్గడం, ప్రకృతిపై ఆధారంగా ఉండే జీవితాలను డబ్బుపై, సాంకేతికత వేపు మరలించడం, ఆరోగ్యాలు క్షీణించడం, ఖర్చులు ఎక్కువై నష్టాల్లో పడటం, మీడియా, సెల్‌ఫోన్లు, మానసికంగా తెచ్చే ఒత్తిడితో పట్టణాల వైపు పయనించడం, విరివిగా వస్తున్న మద్యం షాపులను పూర్తిగా వినియోగించుకోవడం – సంక్షేమ పథకాలపైనే జీవితాలను గడపటం..... ఇలా గ్రామాల్లోని జీవన విధానాలు మారుతుండటం శోధ యాత్రీకులు గమనించారు. అంతర్గతంగా రైతుల కష్టాలు ఎక్కువ అవుతున్నాయి. ప్రభుత్వం, పరిశ్రమలు చేస్తున్న ప్రయోగాలు, సలహాలు, నూతన ప్రక్రియలు, యాంత్రికత, ఇవన్నీ రైతుకు లాభం చేస్తున్నట్లుగాని, కష్టాలను తొలగిస్తున్నట్లుగాని కనిపించడం లేదు. ప్రతి రైతు తన సంతానం రైతుగా కొనసాగించవద్దన్న నిర్ణయానికి వచ్చాడు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే పిల్లలు అభివృద్ధి చెందే అవకాశాలు తక్కువ ఉంటాయన్న ఆలోచనతో ప్రైవేటు బడులు, ఇంగ్లీషు మీడియాలకే వారిని పంపిస్తున్నారు.

గ్రామాల్లోని సంక్షేమ పథకాలు యాత్రీకులకు విపరీతంగా కనిపించాయి. చేపనివ్వడం అలవాటు చేస్తున్నారే తప్ప చేపలు పట్టడం నేర్పించటం లేదనిపిస్తున్నది. ప్రజలకు అత్యవసరమైన నీళ్ళు, కూరగాయలు, పాలు లాంటివి కూడా గ్రామాలకు బయటినుండి రావడం శోచనీయం. చిన్న శోధయాత్రల్లో గ్రహించిన సత్యాలు మన గ్రామ భవిష్యత్తును ఆశాజనకంగా చూపించటం లేదు.

పెట్టుబడులు తగ్గించడం, స్వయం సమృద్ధి దిశగా గ్రామ జీవనం కొనసాగించడం, గ్రామాల్లో తయారు చేసిన యంత్రాలను, పరికరాలను ఎక్కువగా ప్రజలు ఉపయోగించడం, పంటలకు విలువను జోడించి (ప్రాసెస్ చేసి) అమ్మడం, సాంప్రదాయ జ్ఞానానికి సహజ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వడం, ఊర్లోని వృత్తులకు ప్రోత్సాహం ఇవ్వడం, స్వయం పరిపాలనకు దోహదం చేయడం, వ్యాపారం దృష్టితో గ్రామాలను చూడకుండా గ్రామ ప్రజల క్షేమానికి, ఆరోగ్యానికి తోడిచ్చే పాలసీలు, ప్రణాళికలు తయారు చేయడం లాంటి నూతన ఆలోచనలు, విప్లవాత్మక పద్ధతులు, దేశానికి పట్టుకొమ్మలైన మన లక్షల గ్రామాలను సమృద్ధిగా చేయడానికి తోడ్పడతాయని, భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందని శోధయాత్రీకులు విశ్వసిస్తున్నారు.

కరోనా భయం త్వరగా వీడాలని, మనందరి జీవితాలు తిరిగి గాడిలో పడాలని, చిన్నారులు త్వరలో పాఠశాలలకు పోవడం ప్రారంభించాలని, గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని మనసారా కోరుకుంటూ.....

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# యంత్రాలతో చెగోడీలు, చెక్కలు, వేరుశనగ పప్పు తయారీ

# నిరుద్యోగులకు 'జ్యోతుల జస్వంత్' ముచ్చటైన పరిష్కారం



- పల్లె వీరరాఘవ రెడ్డి

గుంటూరు లోని క్రిష్టియన్ పేట నివాసి'జ్యోతుల జస్వంత్' చదివింది ఐటిఐలో ఫిట్టర్ కోర్సు చేశాడు. అక్కడితో చదువు ఆపేసి, గుంటూరు లోని భారత్ ఇండస్ట్రీస్ అనే ఒక కర్మాగారంలో అప్రెంటిస్‌గా చేరాడు. కొద్ది సంవత్సరాలు అక్కడ పని చేశాక బ్యాంకు సహకారంతో ఒక ఆటో కొనుగోలు చేసి కొంత కాలం ఆటో నడిపాడు. ఈ సమయం లోనే వివాహం అయింది. ఇతనికి ఒక కుమార్తె, ఒక కుమారుడు. కుమార్తె 10వ తరగతి చదువుతుండగా క్యాన్సర్ బారిన పడి చనిపోవడం జరిగింది. కుమారుడు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నాడు. ఇతని భార్య వేరే ఒక సంస్థలో ఉద్యోగం చేస్తూ వుండగా, తల్లి ఇంటివద్దనే చిన్న కిరాణం షాపు నడుపు కుంటూ వుంటుంది. తల్లి కిరాణం షాపుకు అవసరమైన సరుకులు మార్కెట్ నుండి తెచ్చి ఇచ్చి తాను చిన్న చిన్న యంత్రాల రిపేర్లు చెయ్యటం లాంటి పనులు చేసుకుంటూ వుండేవాడు.

జస్వంత్ ఏపని చేసినా శ్రద్ధతో, నిజాయితీ గా చేసేవాడు. అతనిలోని ఈ తత్వమే తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తిని ఆకర్షించింది. అతను జస్వంత్‌తో ఇలా ఆటో తోలి ఎంత సంపాదిస్తావు, నీవు ఫిట్టర్‌గా శిక్షణ పొందావు, ఒక సంస్థలో పని చేసిన అనుభవం కూడా వుంది కదా మరి ఆటో తోలుకునే బదులు నేను ఒక కర్మాగారం ఏర్పాటు చెయ్యాలి అనుకుంటున్నాను, నీలాంటి వ్యక్తి తోడైతే నా కర్మాగారం త్వరగా అభివృద్ధి చెందుతుంది అన్నాడు. అతని సలహా మేర కు ఒక కర్మాగారం ఏర్పాటు చేసిన తర్వాత అందులో చిన్న చిన్న యంత్రాలన్నీ జస్వంత్ పర్యవేక్షణ లోనే తయారయ్యేవి. అలా కొన్ని సంవత్సరాలు చేసిన తర్వాత ఆ సంస్థ కూడా పెద్దది కావటంతో ఇక అక్కడ తన అవసరం లేదని, బయటకు వచ్చి, తాను సంపాదించిన అనుభవంతో తానే స్వయంగా యంత్రాలు తయారు చెయ్యటానికి పూనుకున్నాడు. తనకున్న అనుభవం, సృజనాత్మక ఆలోచనతో మార్కెట్‌లో లభించే యంత్రాలకన్నా తక్కువ ధరకే లభించేలా మూడు యంత్రాలను తయారు చేసి తాను ఉపాధి పొందటమే కాకుండా, అనేక మందికి స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పిస్తున్నాడు.

> **ఇంట్లో పిల్లల కోసం మహిళలు చేసుకునే చిరుతిళ్లే 'చెగోడీలు'. ఇప్పుడు వాటిని కొందరు ఇంట్లో ఖాళీగా వుండే బదులు వ్యాపార దృష్టితో ఇంట్లో పెద్దయెత్తున తయారు చేసి, షాపుల్లో అమ్ముకుంటున్నారు.**

**చెగోడి యంత్రం :**

సాధారణంగా ఇంట్లో పిల్లల కోసం మహిళలు చేసుకునే చిరుతిళ్లే 'చెగోడీలు'. ఇప్పుడు వాటిని కొందరు ఇంట్లో ఖాళీగా వుండే బదులు వ్యాపార దృష్టితో ఇంట్లో పెద్దయెత్తున తయారు చేసి, షాపుల్లో అమ్ముకుంటున్నారు. కానీ చేత్తో చేసే చెగోడీలలో కొన్నింటికి పిండి ఎక్కువ, మరికొన్నింటికి కాస్త తక్కువ వుండటం సాధారణమే. ఈ సమస్యలన్ని గమనించి ఒకే కొలతతో, ఒకే పరిమాణం లో వుండేలా తయారు చేసే యంత్రాలు కూడా మార్కెట్లోకి వచ్చాయి. కానీ ఆ యంత్రాలను లక్షలాది డబ్బు పెట్టి సామాన్యులు కొనలేరు. ఎందుకంటే చెగోడీలు చెసి వ్యాపారం చెయ్యాలి అనుకునే వారు చిన్న, మధ్య తరగతి కుటుంబాల వ్యక్తులు కావటం వల్ల వారికి ఆ యంత్రాలను కొనేంత ఆర్థిక స్థోమత వుండదు.

ఈ సమస్యలకు పరిష్కారం కనుగొన్నాడు 'జ్యోతుల జస్వంత్'. మొదట స్టెయిన్‌లెస్ స్టీల్‌తో యంత్రం తయారు చేశాడు. అది కొద్దిగా ఖరీదు ఎక్కువ కాబట్టి సామాన్యులు కొనలేరు అనుకున్నాడు. ఆ తర్వాత నాణ్యమైన ఇనుముతో యంత్రం తయారు చెయ్యటం వల్ల మధ్య తరగతి కుటుంబం వారు కూడా దాన్ని కొని, వ్యాపారాత్మకంగా చెగోడీలు చేసుకునే సదుపాయం కల్పించాడు.

చేత్తో చేసే చెగోడీలు తూకం ప్రకారం అమ్మాలి అంటే అన్ని ప్యాకెట్లలోని తూకం ఒకేలా వుండొచ్చు

కానీ, సంఖ్యలో హెచ్చు తగ్గులు వుంటాయి. పోనీ ప్యాకెట్‌కు ఒక నిర్దిష్టమైన సంఖ్యలో నింపితే తూకంలో తేడా వల్ల నష్టం జరిగే అవకాశం వుంటుంది. ఈ యంత్రంతో చెగోడీలు చేస్తే అన్నీ ఒకే పరిమాణం, సరియైన తూకం, సంఖ్య వుంటాయి. నాణ్యత కూడా ఒకే రకంగా వుంటుంది కాబట్టి వ్యాపారులు కూడా వీటిని తీసుకోవటానికే ఎక్కువగా ఇష్టపడతారు.

వ్యాపార రీత్యా రోజుకు వేలల్లో చెగోడీలు చెయ్యాలంటే కనీసం 10 మంది అవసరం అవుతారు. అయితే ఈ యంత్రంతో చెగోడీలు చెయ్యాలంటే, పిండి తడిపి ముద్దగా చెయ్యటానికి ఒక మనిషి, యంత్రం వద్ద ఒక మనిషి, తయారైన చెగోడీలు నూనెలో వేయించడానికి ఒక మనిషి మొత్తం ముగ్గురు మనుషులు రోజుకు మూడు వేలకు పైగా చెగోడీలు తయారు చేస్తారు. ముగ్గురు వ్యక్తులు కూడా పెద్దగా అలుపు లేకుండా చేయటమే కాక, కనీసం 7 మంది కూలీల ఖర్చును మిగిలించు కున్నట్లు అవుతుంది. ఆ ముగ్గురూ ఇంటివాళ్ళే అయితే మొత్తం కూలీల ఖర్చు లాభంగా మారుతుంది. గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు, ఇంటివద్ద ఖాళీగా వుండే మహిళలు ఒక యంత్రాన్ని తీసుకున్నట్లయితే వారు అనవసరమైన పూసుపోని కబుర్లతో సమయం వృధా చేసుకోకుండా అదనపు ఆదాయం కూడా సమకూర్చుకున్నట్లు అవుతుంది.

**'అప్పాల' యంత్రం :**

జ్యోతుల జస్వంత్ చేసిన రెండో యంత్రం 'అప్పాలు' (కొన్ని ప్రాంతాల్లో వీటిని 'చెక్కలు' అంటారు) చేసే యంత్రం. ఈ యంత్రానికి అప్పాలు చెయ్యటానికి అవసరమైన పిండి తడుపుకుని, ముద్దలుగా చేసి యంత్రం వద్ద వుంచినట్లయితే వాటిని అప్పాలుగా వత్తుతుంది. వాటిని తీసుకుని నూనెలో వేయించటం మరో వ్యక్తి చేసే పని. వీటిని చాలా సులభంగా తయారు చేస్తుందీ యంత్రం. ఇప్పుడు ఈ అప్పాలకు కూడా గిరాకీ బాగా వుండటంతో ఈ యంత్రం ద్వారా తయారైనవి ఒకే సైజులో, అందంగా వుండటం వల్ల వినియోగదారులను బాగా ఆకట్టుకుంటున్నాయి.

**వేరుశనగ పప్పు యంత్రం :**

జ్యోతుల జస్వంత్ వీటితో పాటు మరో యంత్రాన్ని కూడా తయారు చేశాడు అదే వేరుశనగ పప్పు పైపొట్టు తీసి, గింజలను రెండు ముక్కలుగా చేసే యంత్రం.

పైన చెప్పిన అప్పాలు తయారు చేయటం లో వేరుశనగ పప్పు కూడా చేరుస్తారు. అంతే కాక వేరుశనగ, బెల్లంతో చిక్కీలు లేదా వేరుశనగ గుండ్లు తయారు చేసి విక్రయిస్తూ వుంటారు. ఇవి తయారు చెయ్యాలంటే ముందుగా వేరుశనగ పప్పును పెనంపై వేయించి, అవి చల్లారిన తర్వాత వాటిని చేతితో లేదా ఒక చెక్కతో పలుకులుగా తయారు చేసి ఆ తర్వాత ఆ పలుకులలో వున్న పొట్టును వేరు చేయాల్సి వుంటుం ది. పెద్దయెత్తున వ్యాపార రీత్యా భారీ స్థాయిలో చేయాలంటే, వాటికి తయారు చెయ్యాలంటే తప్పక కూలీలను ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది. పైగా ఈ

> **గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు, ఇంటివద్ద ఖాళీగా వుండే మహిళలు ఒక యంత్రాన్ని తీసుకున్నట్లయితే వారు అనవసరమైన పూసుపోని కబుర్లతో సమయం వృధా చేసుకోకుండా అదనపు ఆదాయం కూడా సమకూర్చుకున్నట్లు అవుతుంది.**



వేరుశనగ పప్పును పలుకులుగా చెయ్యటంలో సరియైన అనుభవం లేనివారు చేస్తే ఎక్కువగా ముక్కలు కావటం జరిగితే చిక్కీ లేదా గుండ్లు తయారీ నాణ్యంగా వుండదు. ఈ పని కొరకు ఒక పిండిమర లాంటి యంత్రాన్ని తయారు చేశాడు జస్వంత్. వేరుశనగ పప్పును వేడి చేసిన తర్వాత ఈ యంత్రంలో వేసినట్లయితే పప్పు ముక్కలు ముక్కలుగా కాకుండా కేవలం రెండు ముక్కలుగా వేరు చేసిన తర్వాత పలుకులు ఒకవైపు, పైపొట్టు మరో వైపు ఏర్పాటు చేయబడింది. ఆ తర్వాత వాటిని కావలసిన పదార్థాలు చెయ్యటానికి సిద్ధంగా వుంటాయి. 10 మంది చెయ్యాల్సిన పని ఇద్దరు వ్యక్తులు మాత్రమే చేసుకోవచ్చు, పైగా నాణ్యత వుంటుంది, శ్రమ కూడా చాలా తక్కువ.

జ్యోతుల జస్వంత్ తయారు చేసిన ఈ మూడు యంత్రాలు కేవలం ఒక్క హార్స్‌పవర్ కరెంటు మోటారుతో పని చేస్తాయి కావున విద్యుత్ ఖర్చు కూడా పెద్దగా వుండదు. కాబట్టి నిరుద్యోగ యువతీ యువకులు తక్కువ ఖర్చుతో రోజుకు 3 నుండి 5 వేల వరకు సంపాదించుకోవచ్చు.

ఆహార పరిశ్రమ వేల కోట్ల రూపాయలతో ముడి పడి వున్నది. తినుబండారాలను బయటనుండి కొని తినటం అధికం కావటం వల్ల "రెడీ టు ఈట్" పరిశ్రమకు బాగా డిమాండ్ పెరుగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పరిశ్రమను యాంత్రికం చెయ్యటం చాలా ముఖ్యం. ఈ కార్యాన్ని ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు చేపట్టక పోయినా, సామాన్యులైన గ్రాస్ రూట్స్ ఇన్నోవేటర్లు ఈ పరిశ్రమకు అవసరమైన యంత్రాలను తయారు చేసి, ఆహార పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నారు. ఇలాంటి యంత్రా లను "ఏఎల్ఇఎపి (అలీప్)" లాంటి సంస్థలు గ్రామీణ అభివృద్ధి శాఖలు శ్రద్ధ వహిస్తే, సమాజంలో ఆదాయ అవకాశాలు పెరుగుతాయి. జ్యోతుల జస్వంత్ యంత్రాలను అభివృద్ధి చేయటా నికి, ఇంకా తక్కువ ధరకే లభించేలా చెయ్యటానికి దేశమంతటా ఈ లాభదాయక యంత్రాలను విస్తృతం చేయటానికి 'పల్లె సృజన' శాయశక్తులా కృషి చేస్తుంది.

**జ్యోతుల జస్వంత్ ఫోన్ నెం. 9440019271**

# కలుపు నివారణకు రైతుల సృజనాత్మక ఆలోచనలు

## పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన చేతి పరికరాలు




రైతుకు పొలంలో పంట పెరిగితే ఆనందమే. కానీ దానికి ప్రతిబంధకంగా పంటతో పాటు కలుపు పెరుగుతూ వుంటే సహించలేడు. ప్రస్తుతం కురుస్తున్న విపరీతమైన వర్షాల వల్ల చాలామంది రైతుల పొలాలు బీళ్ళుగా మారిపోయాయి. ఎక్కువ రోజులు వర్షాలు వడి ఒరిపి ఇవ్వడంతో అందరూ కలుపు నివారణపై పడిపోయారు. అందువల్ల కూలీల లభ్యత చాలా కష్టంగా మారిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో కలుపు నివారణ మందుల వైపు వెళ్తున్నారు. కానీ కలుపు మందును ప్రధాన పంటకు తగలకుండా ఎలా కొట్టాలా అని ఆలోచిస్తూ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వుండి పోతున్నారు కొందరు రైతులు.

అవసరం ఆలోచింప చేస్తుంది అనటానికి ఎవరో ఒక రైతు కనిపెట్టిన ఉపాయం చాలా మంది రైతులకు ఎంతో ఊరట ఇచ్చింది. ఈ పద్ధతి ఎవరికి వారు తయారు చేసుకోవటమే. దీన్ని మార్కెట్‌లోకి వెళ్ళి కొని తీసుకు రావాల్సిన అవసరం లేదు. ఇంత మంచి ఆలోచన చేసిన ఆ రైతును 'పల్లెసృజన' మనస్ఫూర్తిగా అభినందిస్తోంది.

**పంటకు తగలకుండా కలుపు మందు పిచికారి చేసే పద్ధతి:**

6 అంగుళాల పివిసి పైపును ఒకదాన్ని తీసుకుని, దాన్ని నిలువునా సగానికి కోసివేయాలి. అప్పుడు రెండు ముక్కలుగా (ఒక దోని లాగా) తయారవుతాయి. అలా సగానికి కోసిన రెండు పైపులకు ఒక కొసలో తాడు కట్టి (5-6 అడుగుల తాడు) ఆ తాడు మరో కొసలో ఒక వెదురు కర్రకు కట్టి వుంచాలి. రెండు పైపులను పంట వున్న సాలు పైన బోర్చించి కర్రను లాక్కుంటూ వెళ్తే ఆ పైపు పంటను కప్పివేస్తుంది. పైపు కప్పి వున్నంత మేర మధ్యలో వున్న కలుపుపై పిచికారి చేస్తూ వెళ్ళే చాలు పంటకు ఎటువంటి హాని జరగకుండా కలుపు మందు పిచికారి చేసుకోవచ్చు.

కానీ కలుపు నివారణ మందులు చాలా ప్రమాదకరం అయినవి అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు కాబట్టి అటువంటి ప్రమాదకర రసాయనాలు వీలైనంత వరకు ఉపయోగించకుండా వుంటే మంచిది అని పల్లెసృజన సూచిస్తోంది. చిన్నకారు రైతులు అంతర సేద్యాల కొరకు ఎద్దులను కిరాయి తీసుకోవాలన్నా ఇబ్బందే, మనుషులు చేయాలన్నా ఇబ్బందే. అటువంటి వారి కోసం పల్లెసృజన వెలుగులోకి తెచ్చింది ఒక పరికరం. అమరావతి ప్రాంతానికి చెందిన ఒక రైతు నారాయణ రెడ్డి, అతని మిత్రుడైన వెల్డింగ్ షాపు యజమాని కె.ఎల్. పాల్ అనే ఇద్దరు కలిసి ఒక పరికరాన్ని తయారు చేశారు. ఆ పరికరానికి ఒకవైపు గొర్రు మరోవైపు గుంటక పలుగు ఏర్పాటు చేయబడి వుంటాయి. ఆ పరికరాన్ని







మనుషులు లాగి పని చేసుకోవచ్చు. ఒకసారి గొర్రు ఉపయోగించి, మరోసారి అదే పరికరాన్ని తిప్పి వేసి గుంటక తోలుకుంటే కలుపు నివారణ త్వరగా చేసుకోవచ్చు. అయితే దీన్ని అంతర సేద్యంగానే చేసుకోవాలి.

ఆ తర్వాత చెట్ల మధ్యన కలుపు నివారణకు కూడా పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన పరికరం 'కుర్పీ' అనే చిన్న పరికరం. దీనికి 6 అడుగుల కర్రను తగిలించుకొని, చేతితో తక్కువ శ్రమతో మొక్కల మధ్య కలుపును సులభంగా నివారించుకోవచ్చు. సాధారణంగా 10 మంది కూలీలు చేసే పనిని కేవలం ఇద్దరంటే ఇద్దరు వ్యక్తులు ఎటువంటి శ్రమ లేకుండా చేస్తారు.

ఈ పనులన్నీ చెయ్యలేము, మాకు కలుపు నివారణ మందు పిచికారి చేయటమే సులభం అనుకుంటున్నారా? అయితే అందుకు కూడా 'హనీబీ నెట్‌వర్క్' ద్వారా ఒక చిట్కా వెలుగులోకి వచ్చింది. ఈ పద్ధతిని ప్రయోగించి రసాయన రహిత కలుపు నివారణ చేసుకో గలరు.

**కలుపు నివారణకు సులువైన చిట్కా:**

కలుపు నివారణకు గుజరాత్ రాష్ట్రంలోని జునాగడ్ జిల్లా, కేశోడ్ తాలూకా, పిప్లీ ప్రాంతానికి చెందిన 'కరంషీ భాయ్ వంజీభాయ్ వన్‌ప్రియా' అనే రైతు ఈ పద్ధతిని చాలా సంవత్సరాలు గా ఉపయోగించి ఫలితం పొందుతున్నాడు.

**కావలసినవి:**

**10 లీటర్ల గో మూత్రం, ఒక కిలో గోమయము (ఆవు పేడ)**

**250 గ్రా. పటిక బెల్లము, 50 గ్రా. కాల్షియం కార్బోనేట్ (గ్యాస్ వెల్డింగ్ లో వాడేం సుద్దముక్క)**

ఈ నాలుగింటినీ 5 లీటర్ల నీటిలో కలిపి బాగా కలియ తిప్పాలి కొద్దిసేపటి తర్వాత ఈ ద్రావకాన్ని వడకట్టి కలుపు మొక్కల మీద పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుంది. ఇది పంట వేసే ముందు చేస్తే, పంటకి హాని చేసే కలుపు నివారణ సాధ్యమౌతుంది. ఈ ప్రక్రియ విత్తనాలు వేసే ముందు చేస్తే అద్భుత ఫలితాలు వుంటాయి. ఎందుకంటే పంటకన్నా కలుపు త్వరగా పెరుగుతుంది. దానిని నివారించినవాళ్ళం అవుతాం. ఎట్టి పరిస్థితుల్లో ఈ ద్రావకం పంటమీద పిచికారి చేయకూడదు. దీనివలన పంటపై దుష్ఫలితాలు వచ్చే ప్రమాదముంది. అందుకే మొదట చెప్పిన పద్ధతిలో పైపులను పంటపై మూసి వుంచి పిచికారి చేసుకోండి.

మార్కెట్‌లో లభించే రసాయన మందులు క్యాన్సర్ కారకాలు అని శాస్త్రవేత్తలు చెబుతున్నపుడు వాటిని ఉపయోగించి ఆరోగ్యాలు పాడు చేసుకోవడం ఎందుకు. ఈ మందు తయారీలో పెద్ద కష్టమూ లేదు, నష్టమూ లేదు. ప్రయోగించి చూడండి. ఫలితం బాగా వుంటే మంచిదే కదా!

**పరికరాల కొరకు సంప్రదించండి : వీరరాఘవ రెడ్డి, 8125799904, సుభాష్ చందర్, 9652801700**

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. అంతే కాక పునాది స్థాయి ఇన్నోవేషన్లు ఎన్నో అందుబాటులోకి రావటం, గ్రామాల్లోనే ఎంతోమందికి ఉపాధి లభించటం జరిగింది.

గత 16 యేళ్ళ ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం. ఈ ప్రయత్నంలో మీ సమస్యలను మీవద్దనుండి సేకరిం చాలని నిర్ణయించుకున్నాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. - ఎడిటర్

**వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700**



## నారు నాటడం, విత్తనం వేసే ఖర్చును గణనీయంగా తగ్గించిన

# గోవర్ధన్ దాస్ ట్రాక్టర్ అనుసంధాన పరికరం

- పల్లె వీరరాఘవ రెడ్డి

వర్షాకాలం మొదలైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని ప్రాంతాల్లో పుష్కలంగా వర్షాలు పడుతున్నాయి. వర్షాకాలం మొదలు అవ్వగానే రైతులు తొలకరి విత్తనాలు వేస్తూ వుంటారు. అంతకు ముందే మిరప నాటాలని అనుకున్న రైతులు నారును సిద్ధం చేసుకుని వుంటారు. వర్షాలు మొదలయ్యే ముందే మిరప నాటుకు పొలాన్ని సిద్ధం చేసుకుని చాల్లు తోలుకుని వుంటారు. వర్షం పడిన వెంటనే మిరప నాట్లు మొదలు పెడతారు. కొన్ని వర్షం పడని ప్రాంతాల్లో రైతులు ఆందోళన చెంది మిరప నారు ముదరుతోంది, వర్షం పడలేదు అని బాధపడుతూ వున్న సమయంలో ఆకాశం మేఘావృతం అయ్యే సూచనలు కనుగొని వర్షం కొద్ది రోజుల్లో వస్తుందన్న విశ్వాసంతో వట్టి పొలంలోనే నీరు పోసి మిరప నాటడం జరుగుతూ వుంటుంది. అలా నాటిన మొక్కలు రెండు మూడు రోజుల పాటు నారు నాటేటపుడు పోసిన నీటితో జీవం పోసుకుంటూ వుంటాయి. అటువంటి సమయంలో వర్షం పడిన వెంటనే అవి పొలంలో బాగా నాటుకుని మొక్కలు పచ్చగా తయారౌతాయి.

ఇలా వట్టి పొలంలో నారు నాటాలంటే భూమిని వేళ్ళతో రంధ్రం చేసి అందులో మొక్కను పెట్టి, నీరు పోయటం చాలా శ్రమతో కూడుకున్న పని, పైగా కూలీల ఖర్చు కూడా చాలా ఎక్కువ. వట్టి పొలంలో నారు నాటేందుకు కొందరు కూలీలు సుముఖత చూపరు. కారణం వట్టి పొలంలో వేలితో రంధ్రం చేస్తే వేళ్ళు వరుసుకు పోతాయనే భయం వారిలో వుంటుంది. అటువంటి సమయంలో రైతులు మగ కూలీలను కూడా ఏర్పాటు చేసుకుని ముందుగా మగవారు కర్రతో రంధ్రాలు చేసుకుంటూ వెళ్తే వెనక మహిళా కూలీలు ఆ రంధ్రంలో నారుని వుంచి, నీరు పోసుకుంటూ వెళ్తారు. ఈ పనికి కూలీల ఖర్చు ఇంకా అధికంగా పెరిగిపోతుంది.

ఈ సమస్యకు పరిష్కారం కనుగొన్నాడు గుంటూరు జిల్లా, చెరుకూరు మండలం లోని యామర్తి గ్రామానికి చెందిన ఒక దివ్యాంగుడు 'మౌండూరి గోవర్ధన్ దాస్'. ఇతని వయస్సు 32 సంవత్సరాలు, ఏమీ చదువుకోలేదు, ఒక కాలు లేదు పెట్టుడు కాలుతో పని చేసుకుంటూ వుంటాడు. వివాహం అయి ఒక కుమారుడు, కుమార్తె వున్నారు. కుమారుడు 6వ తరగతి చదువుతుండగా, కుమార్తె 3వ తరగతి చదువుతోంది. గోవర్ధన్ చిన్నప్పటి నుంచి వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఏ పరికరాన్నయినా ఎంతో శ్రద్ధతో గమనించడం, దాని పనితీరును బేరీజు వేసుకోవడం ఇతని అలవాటు. గోవర్ధన్ దాస్ లోని సృజనాత్మకతను పసికట్టిన ఒక రైతు అతనితో మిరప నారు నాటాలంటే కూలీల ఖర్చు భరించలేకుండా వుంది. దీనికి ఏదైనా పరిష్కారం ఆలోచించమని కోరాడు. ఒక్క ఎకరం నాటు వేయాలంటే 10 మంది మహిళలు, 10 మంది మగ కూలీల ఖర్చు దాదాపు 6 నుండి 7 వేల దాకా అవుతుంది దీనికి ఖర్చు తగ్గేందుకు ఏదైనా పరిష్కారం కనుగొనమన్నాడు.

**మనుషులు పొలంలో కర్రలతో రంధ్రాలు చెయ్యటం, వెనకనే మరో మనిషి ఆ రంధ్రాల్లో నారు పెట్టి, నీరు పోయటం గమనించాడు. ఈ పద్ధతిలో రెండు విషయాలు గమనించాడు గోవర్ధన్ ముందుగా రంధ్రాలు చేసే కూలీ కర్రతో చేసే రంధ్రాలు ఒక నిర్దిష్టమైన కొలతలో లేవు, ఒక్కోచోట రంధ్రం కనవడక వెనక నాటు వేసే వారు ఇబ్బంది పడుతున్నారు. పైగా నారు ఎక్కువగా లోతుగా నాటక పోవటం వల్ల అవి చనిపోతున్నాయి. ఈ సమస్య లన్నిటికి పరిష్కారం...**

మనుషులు పొలంలో కర్రలతో రంధ్రాలు చెయ్యటం, వెనకనే మరో మనిషి ఆ రంధ్రాల్లో నారు పెట్టి, నీరు పోయటం చేయాలి. ఈ పద్ధతిలో రెండు విషయాలు గమనించాడు గోవర్ధన్. ముందుగా రంధ్రాలు చేసే కూలీ కర్రతో చేసే రంధ్రాలు ఒక నిర్దిష్టమైన కొలతలో లేవు, ఒక్కోచోట రంధ్రం కనవడక వెనక నాటు వేసే వారు ఇబ్బంది పడుతున్నారు. పైగా నారు ఎక్కువగా లోతుగా నాటక పోవటం వల్ల అవి చనిపోతున్నాయి. ఈ సమస్య లన్నిటికి పరిష్కారం ఆలోచించి తన మదిలోనే ఒక నమూనా తయారు చేసుకుని ఆ రైతుకు చెప్పాడు. ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించాను అన్నాడు. మీరు సాధారణంగా ప్రస్తుతం చేస్తున్న పనిలోని లోటుపాట్లు కూడా లేకుండా పరికరం వుంటుంది. ఈ ఖర్చు

ఖరిస్తే నేను పరికరం తయారు చేస్తాను అన్నాడు. అది పని చేస్తుందో లేదో కదా అనుమానం వ్యక్తం చేసిన రైతుతో ఒకటే మాట అన్నాడు. పరికరం తప్పక పని చేస్తుందన్న నమ్మకం నాకుంది. పదివేలు ఖర్చవుతుంది. అది ఇవ్వండి చాలు, ఒకవేళ పని చెయ్యకుంటే ఒక్క రోజు కూలీల ఖర్చు వృధా అవుతుంది. పని చేస్తే మీ పొలం నారు నాటే ఖర్చు సగానికి సగం తగ్గిపోతుంది కదా అన్నాడు.

గోవర్ధన్ చెప్పిన తర్కానికి సమ్మతించిన ఆ రైతు పదివేల రూపాయలు ఇచ్చి పని మొదలు పెట్టు అన్నాడు. వెంటనే పనిలో నిమగ్నమై తాను అనుకున్న విధంగా ఒక పరికరాన్ని తయారు చేశాడు. ఈ పరికరం ట్రాక్టరుకు అనుసంధానించిన గొర్రుకు వెనకాల అమర్చుతారు. ట్రాక్టర్ వెళ్తూ వుంటే ముందుగా గొర్రు సాలులోనే సమాన దూరంలో రంధ్రాలు వేసుకుంటూ వెళ్తుంది. వెనకాల నారు నాటే కూలీలు ఆ రంధ్రంలో మొక్కను వేసి నీరు పోసి, మట్టితో కప్పి పెడతారు. పొలం మొత్తం సమాన దూరంలో నారు నాటబడుతుంది. నాటేందుకు వేసే రంధ్రాల లోతును కూడా నియంత్రించుకునే నదుపాయం కల్పించాడు గోవర్ధన్.

**ఈ పరికరాన్ని ఉపయోగించి నారు నాటుకోవడం వల్ల నాటు వేసే కూలీలతో సమానంగా రంధ్రాలు వేసే కూలీలను నియ మించే అవసరం లేకుండా పోయింది. రైతుకు 6 నుండిం 7 వేల రూపాయల వరకు అయ్యే ఖర్చు ఈవిధంగా చేయటం వల్ల సగానికి సగం తగ్గిపోయి, 3 వేల రూపాయల ఖర్చుతో అయి పోతుంది. ఇప్పుడు నాట్లు వేసే కూలీలు, ట్రాక్టరు కిరాయి మాత్రమే ఖర్చవుతుంది. కర్రలతో రంధ్రాలు చేసే కూలీలు ఖర్చు తగ్గిపోతుంది.**

ఈ పరికరాన్ని ఉపయోగించి నారు నాటుకోవడం వల్ల నాటు వేసే కూలీలతో సమానంగా రంధ్రాలు వేసే కూలీలను నియమించే అవసరం లేకుండా పోయింది. రైతుకు 6 నుండి 7 వేల రూపాయల వరకు అయ్యే ఖర్చు ఈవిధంగా చేయటం వల్ల సగానికి సగం తగ్గిపోయి, 3 వేల రూపాయల ఖర్చుతో అయిపోతుంది. ఇప్పుడు నాట్లు వేసే కూలీలు, ట్రాక్టరు కిరాయి మాత్రమే ఖర్చవుతుంది. కర్రలతో రంధ్రాలు చేసే కూలీ ఖర్చు తగ్గిపోతుంది. పని కూడా త్వరగా అవుతుందని రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే గోవర్ధన్ దాస్‌కు ఎటువంటి వర్క్‌షాప్ లేదు. రైతు తనకు ఈ పరికరం కావాలని బయానాగా కొంత డబ్బు ఇస్తే, ఆ డబ్బుతో అవసరమైన సామాగ్రి కొనుగోలు చేసి, తనకు తెలిసిన వర్క్‌షాప్‌ల వద్ద అవసరమైన వెల్డింగ్ పనులు చేసుకుని, మొత్తం సామాగ్రి రైతు ఇంటివెద్దకే తీసుకు వెళ్ళి అక్కడే దాన్ని బిగించి ఇస్తాడు. ఈ తతంగం అంతా కేవలం 3 లేదా 4 రోజుల్లో అయిపోతుంది. గోవర్ధన్ ఇప్పటికి ఇలాంటి పరికరాలు 20 దాకా చేసి రైతులకు అందించాడు. అందరూ ఆనందంగా తన పనులు చేసుకుంటున్నారు. ఈ పరికరం కేవలం నాటు వేయటానికి మాత్రమే ఉపయోగించటం లేదు. కొన్ని రకాల విత్తనాలు కూడా ఈ పరికరం సహాయంతో విత్తుకుంటున్నారు.



రాయలసీమ ప్రాంతంలో వర్షం పడిన వెంటనే మిరప నార్లు నాటుతారు. కానీ ఉత్తరాంధ్ర ప్రాంతం వారు వర్షం పడినప్పుడు నాటితే కొందరు కూలీలు పైపైనే నాటుతారు కాబట్టి చనిపోయే మొక్కల శాతం ఎక్కువ అని, వర్షం పడిన తర్వాత మూడవ రోజు ఇలా ట్రాక్టరుకు పరికరాలను తగిలించుకుని రంధ్రాలు వేసి కూలీలచే నీళ్ళు పోయించి నాటుతారు. ఇలా చేయటం వల్ల నాటిన మొక్కలన్నీ బ్రతికి చిగురు వేస్తాయని వారి నమ్మకం.

వికలాంగుడైనా, గోవర్ధన్ సృజనాత్మకతతో చేసిన పని ఎంతో మంది రైతులకు వ్యవసాయ పెట్టుబడి ఖర్చును మిగిలేలా చేసింది. ప్రస్తుతం దీని ఖరీదు మూడు చక్రాల పరికరం 30 వేలు, 4 చక్రాల పరికరం 40 వేలు అవుతుందన్నాడు. దీన్ని ఒక్కొక్కటి కాకుండా ఒకేసారి కొన్ని పరికరాలు చేసి పెట్టుకో గలిగితే దీని ఖరీదు ఒక్కోదానిపై 3 నుండి 4 వేల వరకు తగ్గుతుందని అన్నాడు. ప్రభుత్వం లేదా సహృదయులు ఎవరైనా అవసరమైన వెల్డింగ్ పరికరం మరికొన్ని పనిముట్లు ఏర్పాటు చేయటానికి సహకరిస్తే దీని ఖరీదు ఇంకా తగ్గటమే కాదు, దీన్ని ఇంకా అభివృద్ధి చేసి, దాదాపు అన్ని రకాల విత్తనాలు కూడా వేసుకునే విధంగా తయారు చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు గోవర్ధన్ దాస్. ఇతని ఆలోచనా విధానానికి తగిన సహాయ సహకారాలు అందించేందుకు 'పల్లెసృజన' కృషి చేస్తుంది. రైతాంగం ఇలాంటి పరికరాలను వాడుకుని వ్యవసాయ పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని కోరుతోంది. ●

**ఇన్నోవేటర్ గోవర్ధన్ దాస్, ఫోన్ నెం. 9505827749.**

# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు




**ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ బహుమతి పొందిన విజేతల వివరాలు**

**- 'ఎన్.ఐ.ఎఫ్. వారి వ్యాసాలకు స్వేచ్ఛానువాదం : జమ్ములమడక శశిమోహన్**

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

### ట్రాక్టర్ అనుసంధానిత 'వివిధ పంటల నూర్పిడి యంత్రం'

**పేరు : ఝూబ్రమాల్ ఖోఖర్**

**నివాసి : శికర్, రాజస్థాన్**



రాజస్థాన్ లోని శికర్ ప్రాంతానికి చెందిన 34 సంవత్సరాల ఝూబ్రమల్ ఖోఖర్, 8వ తరగతి వరకు చదివి ఆపై చదవటం కుదరక ఒక చిన్న వర్క్‌షాప్ ప్రారంభించి, వ్యవసాయ పనిముట్లకి రిపేర్లు చేస్తూ, అడపా దడపా రైతులకు పనికి వచ్చే కొత్త వ్యవసాయ పరికరాలను కూడా తయారు చేస్తూ వుంటాడు. ఈ క్రమంలో అతనికి వ్యవసాయ పనిముట్ల మీద మంచి అవగాహన ఏర్పడింది.

ఒకసారి ఝూబ్రమల్ రాజస్థాన్‌లోనే వున్న 'నాగౌర్' జిల్లాలోని ఒక ఊరికి వెళ్ళాడు. అక్కడ ఇతను స్థానిక రైతులు ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన ఒక నూర్పిడి యంత్రంతో పెసర పంటను కోయడం చూశాడు. కాసేపు నిలబడి చూసిన తర్వాత ఆ యంత్రం సరిగ్గా పని చేయటం లేదని, తరచూ ఆగిపోతోందని, ఇంకా అనేక సమస్యలున్నాయని గ్రహించాడు. ఇవన్నీ గమనించి ఇంటికి వచ్చిన ఝూబ్రమల్ తానే బాగా పనిచేసే ఒక యంత్రం కనిపెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఇతని దృష్టంతా ఎక్కువ ఎత్తు ఎదగని పంటలైన 'పెసలు, జీలకర్ర, సోయాబీన్, శనగ' మొదలైన వాటిని కోయటానికి, నూర్పిడి చేయడానికి అనువుగా ఉండాలి. అనేక ప్రయోగాలు చేసి, 2015 నాటికి తన మొదటి యంత్రాన్ని రూపొందించాడు. దాదాపు రెండు సంవత్సరాలు తన పొలంలోనే కాక, అనేక మంది పొలాల్లో దాంతో ప్రయోగాలు చేసి ఎక్కువ ఎత్తుకు ఎదగని పంటల కోత – నూర్పిడికి సంతృప్తికరంగా పని చేసే ఒక యంత్రాన్ని 2017లో స్థిరీకరించాడు. ఈ యంత్రం ప్రత్యేకత ఏమిటంటే, దీన్ని ట్రాక్టర్ ముందు లేదా వెనక భాగంలో కూడా అనుసంధానించుకోవచ్చు.

ఈ యంత్రం వాడిన చాలామంది అప్పటికే వాడుకలో వున్న చాలా యంత్రాలకన్నా ఇది పెసలు, మినుములు, సోయా, శనగ మొదలైన పంటలకి చాలా సంతృప్తికరంగా పని చేస్తోందని కితాబు ఇచ్చారు. హైడ్రాలిక్ పద్ధతిలో పనిచేసే ఈ యంత్రం ట్రాక్టర్ వెనక అమర్చుకున్నపుడు, రివర్స్ గేర్‌లో ట్రాక్టర్ నడిపినపుడు కూడా పని



చేస్తుంది. దీంతో పంట ఎలా వేసినా (గొర్రుతో విత్తినా, వెదజల్లినా సరే) నూర్పిడి చేయడానికి అనువుగా వుంటుంది. ఈ యంత్రం 1.75 మీటర్ల వెడల్పు వుండి, భూమినుండి 2.5 నుండి 4 సెం.మీ ఎత్తులో పంటను కత్తిరిస్తుంది. పంటను బట్టి గంటకి పావు ఎకరం నుండి అర ఎకరం వరకు నూర్పిడి చేసుకోవచ్చు. గంటకి 2 నుండి 2.5 లీటర్ల ఇంధనం ఖర్చవుతుంది. ఈ యంత్రం ఖరీదు రూ. 65,000/-లు. ఇప్పటి వరకు ఝూబ్రమాల్ తన పరిసర ప్రాంతంలో 25 వరకు యంత్రాలను అమ్మాడు. అన్నీ సంతృప్తికరంగా పని చేస్తున్నాయి.

ఈ యంత్రాన్ని రూపొందించినందుకు గాను ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 కి గాను 'ఝూబ్రమాల్' ను జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

ట్రాక్టర్ అనుసంధానిత వేరుశనగ నూర్పిడి యంత్రం

**పేరు: నీలేష్ భాయ్ దొబారియా & పంకజ్ భాయ్ లూనాగరియా**

**నివాసి: రాజ్‌కోట్, గుజరాత్ రాష్ట్రం.**



గుజరాత్ రాష్ట్రం లోని రాజ్‌కోట్ జిల్లాకు చెందిన నీలేష్ భాయ్ (35 సం.) తనకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తూనే పాత ప్లాస్టిక్ సామాన్ల వ్యాపారం చేస్తూ వుంటాడు. అంతే వయసుగల పంకజ్ భాయ్ అదే ఊళ్లో వెల్డింగ్ పని చేస్తూ వుంటాడు. వ్యవసాయం చేసే నీలేష్ భాయ్ సమాజ సేవ చేయాలి అంటే చాలా ఉత్సాహంగా ముందుకు వస్తాడు. కొద్దిగా సాంకేతిక పరిజ్ఞానం ఉండటంతో అతను బ్యాటరీతో నడిచే ఆటోమేటిగ్గా నేలను తుడిచే యంత్రాన్ని కనిపెట్టాడు. అది బావుంది అని వాళ్ళ ఊర్లోనే స్వామి నారాయణ్ మందిరంలో దాన్ని వాడుతున్నారు. దీన్ని చూసిన అందరూ అతని తెలివికి మెచ్చుకొని ఇంకా ఇలాంటివి ఏవైనా చెయ్యమని ప్రోత్సహించారు.

తమ ఊళ్లో ఎక్కువగా పండించే వేరుశనగ పంట కోతల సమయంలో కూలీలు దొరక్క రైతులు పడే ఇబ్బందిని గమనించి నీలేష్ భాయ్ వారికి ఏదైనా చెయ్యాలి అనుకున్నాడు. అప్పటికి మార్కెట్‌లో లభించే యంత్రాలు వాడేటపుడు త్రవ్వి తీసిన వేరుశనగ పంటను ప్రోగు చెయ్యడానికి దాని నుండి కాయలను వేరు చేయడానికి, కాయలు ఎండిన తర్వాత వాటినుండి విత్తనాలను వేరు చేయడానికి చాలామంది పనివాళ్ళు అవసరం అవుతారు. ఈ క్రమంలో చాలా వేరుశనగ కాయలు వృధా అవటం కూడా జరుగుతూ వుంటుంది. నీలేష్ తన స్నేహితుడైన పంకజ్‌తో కలిసి వేరుశనగ రైతులు అనుభవించే అన్ని సమస్యలకు పరిష్కారంగా వేరుశనగ చెట్లు పీకడం, కాయలు వేరు చేయడం, అవి ఎండిన తర్వాత విత్తనాలను వేరు చేయడంతో పాటు పొలంలో పడివున్న ఎండు వేరుశనక వ్యర్థాలను కూడా సేకరించేందుకు పనికి వచ్చేలా ఒక యంత్రాన్ని తయారు చెయ్యాలి అనుకున్నారు. అనేక సంవత్సరాలు శ్రమించి 2015లో మొదటి యంత్రాన్ని తయారు చేశారు. దాన్ని అనేక వేరుశనక పొలాల్లో వాడి, అందులోని లోటుపాట్లను సవరించి, ఇంకా సమర్థవంతంగా పని చేసే మెరుగైన యంత్రాన్ని రూపొందించారు.



వీరు ఈవిధంగా అభివృద్ధి చేసిన యంత్రాన్ని ట్రాక్టర్‌కి అనుసంధానం చేసుకోవచ్చు. ఈ యంత్రంలో ముఖ్యంగా నేల నుండి పీకిన వేరుశనక కట్టెను వలిచే యంత్రం వరకు చేర్చడానికి అనువుగా ఒక 'కన్వేయర్ బెల్ట్', కాయలను వేరు చేసే విభాగం, కాయలను వలిచే విభాగాలే కాక, చెత్తను - కాయలను వేరు చేసే విభాగం లాంటి అన్నీ కలిపి ఒకే యంత్రంలో పొందుపర్చబడి వుంటాయి. దీని ద్వారా 600 కిలోల గింజలు, 800 కిలోల వ్యర్థాలు (బుడ్డల పొట్టు) ఈ యంత్రంలో నిలువ చేసుకోవచ్చు. కేవలం 2 లీటర్ల డీజిల్ ఇంధనంతో గంటలో ఒకటి నుండి ఒకటిన్నర ఎకరాల వరకు పంట నూర్పిడి చేసుకోవచ్చు. 90 శాతం సమర్థతతో పని చేస్తుంది. ఈ యంత్రం వాడకానికి ఒక ఎకరానికి 280 నుండి 300 రూపాయలు మాత్రమే ఖర్చవుతుంది. ఇదే యంత్రాన్ని సోయాబీన్ పంటలో అలాగే శనగ పంటలో కూడా సమర్థవంతంగా పని చేయించి చూపించారు. 5 లక్షల ఖరీదు చేసే ఈ యంత్రాన్ని ఇప్పటికే ఆ ప్రాంతంలోని కొందరు రైతులు వాడుతున్నారు.

రైతులకి, ప్రత్యేకించి వేరుశనగ రైతులకు కూలీల రూపంలో ఎంతో ఖర్చును తగ్గించటానికి ఈ యంత్రం కనిపెట్టిన నీలేష్ భాయ్ దొబారియా మరియు పంకజ్ భాయ్ లూనాగరియాలకు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019కి గాను జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

జాతీయ ప్రోత్సాహక పురస్కారం

**ప్రొద్దుతిరుగుడు గింజలను వేరు చేసే యంత్రం**

**పేరు: లఖన్‌లాల్ పటేల్**

నివాసి : రాయ్‌ఘర్, ఛత్తీస్‌ఘర్



ఛత్తీస్‌ఘర్ రాష్ట్రంలోని రాయ్‌ఘర్ ప్రాంతానికి చెందిన 41 సంవత్సరాల లఖన్‌లాల్ పటేల్ 10వ తరగతి పూర్తి చేసిన వెంటనే తన తండ్రి, అన్న చేసే వ్యవసాయానికి తోడుగా చేరిపోయాడు. క్రమంగా వ్యవసాయంలో మెళకువలను తెలుసుకొని ఇప్పుడతను స్వంతంగా తన 10 ఎకరాల పొలంలో ప్రొద్దు తిరుగుడు, కొత్తిమీర, వేరుశనగ పంటలు పండిస్తున్నాడు.

ప్రొద్దుతిరుగుడు పంట వేసే రైతులకి కంకుల నుండి వాటి గింజలను తియ్యడం ఎంత కష్టమో, దానికి ఎంతమంది పనివాళ్ళు ఖర్చు అవుతారో బాగా తెలుసు. తానే స్వయంగా ప్రొద్దుతిరుగుడు పంట వేస్తాడు కనక తన పంట నుండి పూర్తి లాభం పొందకుండా సింహ భాగం కూలీలకే పోవటం బాధ కలిగించేది లఖన్‌లాల్ కి. దీనికి





విరుగుడుగా ప్రొద్దు తిరుగుడు రైతుల ఖర్చు తగ్గించడానికి ఉపయోగ పడే యంత్రాలేమైనా మార్కెట్‌లో వున్నాయా అని వాకబు చేయగా, కొన్ని ఉన్నాయి కానీ, వాటి ధరలు సామాన్య రైతులకు అందుబాటులో లేవని తెలుసుకున్నాడు. దీనితో ప్రొద్దుతిరుగుడు పువ్వు నుండి గింజలను వేరు చేసే సులభమైన, ఎక్కువ ఖర్చు కాని యంత్రాన్ని రూపొందించాలి అని నిర్ణయించుకొని చాలా సంవత్సరాలు తన పొలంలోనే ప్రయోగాలు చేసి, ఒక నమూనా యంత్రాన్ని తయారు చేశాడు.

ఒక హెచ్.పి. మోటారుతో పని చేసే ఈ యంత్రంలో వరుసగా కొన్ని చిన్న రబ్బరు బెల్టులు వుంటాయి. యంత్రం తిరిగేటపుడు ఈ బెల్టులు ప్రొద్దు తిరుగుడు పువ్వుమీద వత్తిడి కలిగించి పువ్వు నుండి గింజలను వేరు చేస్తుంది. దీని సహాయంతో గంటకి 40 కిలోల గింజలను వేరు చేయవచ్చు. 95 శాతం పనితనంలో చేసే ఈ యంత్రంలో కేవలం ఒకటికన్నా తక్కువ శాతం గింజలు ముక్కలయ్యే అవకాశం వుంటుంది. 21 వేల ఖరీదు చేసే ఈ యంత్రాన్ని ఇప్పటికే చాలామంది పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు వాడి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రొద్దు తిరుగుడు రైతులకు ఎంతో ఖర్చును కలిసి వచ్చే మార్గాన్ని చూపించిన లఖన్‌లాల్‌ను అభినందిస్తూ ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019కి గాను జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

**వివరాలకు సంప్రదించండి :సుభాష్ చందర్, ఫోన్:9652801700**

# 'పల్లెసృజన' లో ప్రతి శనివారం "రైతు సదస్సు"

## రైతులకు, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్.పి.ఓ.) సభ్యులకు ఆహ్వానం

'పల్లెసృజన – క్రియేటివ్ మైండ్స్' **FPO** సభ్యుల కొరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న "రైతుల కోసం రైతులు చేసిన గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్ల పై సదస్సు" ను ప్రతి శనివారం నిర్వహించ బడుతున్నది. ఈ సదస్సులో రైతుల సమస్యలకు సరళమైన, అందుబాటులో వుండే యాంత్రిక పరిష్కారాలు, విత్తనాలు, మొక్కలు, పశు మరియు మానవ ఆరోగ్యానికి చెందిన సూచనలు, ఆయుర్వేద పురుగు మందులు లాంటి రైతులు ఆవిష్కరించిన జ్ఞానము..... ఇవన్నీ ప్రదర్శించబడతాయి. మీ సమస్యలను చర్చించి వాటికి పరిష్కారాలు సాధించటానికి ప్రయత్నాలు జరుగుతాయి. ఈ సదస్సుకు ఎఫ్.పి.ఓ. సభ్యులు, రైతులు అందరూ ఆహ్వానితులే. వ్యవసాయంలో శ్రద్ధ వున్న ఎవరైనా ఈ సదస్సుకు ఆహ్వానం.

సదస్సుకు రావాలి అనుకున్న వారు ముందుగా మీ పేరు నమోదు చేసుకో గలరు. కరోనా వైరస్ ప్రమాదం దృష్ట్యా కేవలం 30 మందికి మించకుండా పాల్గొన వచ్చు. మీరు మీ పేరు నమోదు చేసుకున్న తర్వాత మా తరుపున నిర్ధారించిన వారు మాత్రమే పాల్గొనాల్సి వుంటుంది. అందరి సహకారాన్ని కోరుతున్నాం.

సదస్సు నిర్వహించే స్థలము :

**'పల్లెసృజన' కార్యాలయము, ప్లాట్ నెం. 77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి, సికింద్రాబాద్.**

**సమయం : ఉ. గం. 10-30 నుండి మ. 1-30 గం.ల వరకు.**

**వివరాలకు సంప్రదించండి : సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

# గ్రామీణ యువత స్వయం ఉపాధే లక్ష్యంగా 'పునాది స్థాయి ఇన్నోవేషన్లు'



- జమ్ములమడక శశిమోహన్

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంచే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిర్వీర్యంగా కొందరు వుంటే, సోమరులుగా, గ్రామ కంఠకులుగా కొందరు తయారై పోతున్నారు. తద్వారా ఎందరో గ్రామస్తుల ఛీత్కారానికి కూడా గురవుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతిరు. ఈ పరంపరలో ఈ సంచిక నుంచి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

– ఎడిటర్.

## గ్రామీణ రవాణా వ్యవస్థ

## బైక్ ఉంటే చాలు - ఊళ్ళోనే ఉపాధి ఇస్తున్న పునాది స్థాయి ఇన్నోవేషన్లు



పిల్లల పట్ల తల్లిదండ్రుల ప్రేమ అపారమైనది. ఈ అపారమైన ప్రేమతో పిల్లల కోరిక మేరకు వారికి అవసరమైన మోటార్ సైకిల్ తమకు ఎంత కష్టమైనా కొనిపించే తల్లిదండ్రులు ఎక్కువ. అలా మోటార్ సైకిల్‌ను పొంది, జులాయిగా పట్టణాలకు తిరుగుతూ గ్రామంలో చెడ్డ పేరు తెచ్చుకోకుండా దానికో చిన్న అనుసంధాన పరికరాలు ఏర్పాటు చేసుకుంటే చాలు, ఎంతోమంది సమస్యలకు పరిష్కారం చూపటంతో పాటు, మీకు ఉపాధి – గ్రామంలో మంచి పేరు రెండూ పొందటంతో పాటు, తల్లిదండ్రులు కూడా తాము మోటార్ సైకిల్ కొని ఇచ్చినందుకు మావాడికి మంచి ఉపాధి లభించింది అని వాళ్ళు కూడా సంతోషిస్తారు. ఇలా "గ్రామీణ రవాణా వ్యవస్థ"ను మీరు అభివృద్ధి చేసిన వారవుతారు.

ఈ గ్రామీణ రవాణా వ్యవస్థ కోసం కనుగొనబడిందే "మోటార్ సైకిల్ ట్రాలీ". ప్రస్తుత పరిస్థితుల్లో పొలం పనులు చేసేందుకు గ్రామాల్లో కూలీలు దూరంగా వున్న పొలాలకు నడిచి వెళ్ళలేని పరిస్థితులు ఉన్నాయి. అటువంటి రైతులు కూలీలను తరలించేందుకు ఆటోలు,



ట్రాక్టర్లను ఆశ్రయిస్తూ వుంటారు. కొందరికి అవి లభించే అవకాశం కూడా వుండదు. అటువంటి వారికి మీరు సహాకరించవచ్చు. ఈ మోటార్ సైకిల్ ట్రాలీలో వారికి అవసరమైన కూలీలను వారి పొలాలకు చేర్చటం, పొలానికి తీసుకు వెళ్ళ వలసిన ఎరువులు ఇతర సామాగ్రిని చేర్చటం, పొలం నుండి వారి వ్యవసాయ దిగుబడులను ఇంటికి చేర్చడం లాంటి రవాణా సదుపాయాలు మీరు కల్పిస్తే, ఆ రైతు మీకు ఎంతోకొంత నగదు రూపేణా అందిస్తాడు. అది కూడా ఎంతో తృప్తిగా ఇస్తాడు. కొన్ని ఊర్లల్లో బస్టాండు చాలా దూరం వుంటుంది. అటువంటప్పుడు బస్సు దిగే, ఎక్కే ప్రయాణీకులను కూడా రవాణా చేయవచ్చు. మీ సంపాదన కూడా నిజాయితీతో పాటు ఆ రైతు తృప్తిగా ఇచ్చే ప్రతిఫలం వల్ల వచ్చే ఆనందమే వేరబ్బా.....

ఇందుకు మీరు చేయవలసింది కేవలం ఒక "బైక్ ట్రాలీ"ని కొనుగోలు చేయటమే. అది మీ బైక్ ఖరీదు కంటే చాలా తక్కువ. మీ బైక్‌కు ఎలాంటి అదనపు మార్పు చేర్పులు అవసరం లేకుండా అవసరం అయినప్పుడు ఆ ట్రాలీని మీ బైక్‌కు తగిలించుకుని పైన చెప్పిన పనులన్నీ చేసుకోవచ్చు. ఈ పనులన్నీ ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా వుంటాయి. మిగతా సమయంలో మీ ఆనందాన్ని మీరు అనుభవించ వచ్చు. మీ తల్లిదండ్రులకు కూడా పొలం వెళ్ళేందుకు చేదోడు కావచ్చు.

తాము ఉన్న ప్రాంతం లేదా గ్రామంలో ఈసడించుకున్న చోట గౌరవింప బడటం వల్ల ఎంతటి మనోల్లాసం పెరుగుతుందో ఒక్కసారి ఆలోచించండి. నగరాల్లో, పెద్ద పట్టణాల్లో 'పోర్టర్' అనే యాప్ ద్వారా





మనం లగేజీని ఎక్కడికైనా పంపాలన్నా, ఎక్కడినుంచైనా తెచ్చుకోవాలి అన్నా ఆ యాప్ లో నమోదు చేస్తే చాలు. అందులో మోటార్ సైకిల్ నుంచి లారీ వరకు అన్ని రకాల వాహనాలు వుంటాయి. మన లగేజి బరువును బట్టి మనకు కావలసిన వాహనాన్ని ఎన్నుకుంటే వారే ఎక్కడికి కావాలో అక్కడికి చేరవేస్తారు. ఈ యాప్ ద్వారా ఎంతోమంది యువత తమ మోటార్ సైకిల్‌పై చిన్న చిన్న లగేజీలను చేరవేస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. అలా మీరు కూడా మీ పనులతో పాటు ఇలా గ్రామీణ రవాణా ఏర్పాటు చేసుకోగలగితే అదనపు ఆదాయం పొందవచ్చు.

అలాగే కొందరు చిన్న చిన్న కమతాలు వున్న రైతులు తమ పొలంలో వేసిన వంటకు అంతర సేద్యాలు చేసుకోలేక, వాటి కొరకు ఎద్దులను, ట్రాక్టర్లను కిరాయికి తీసుకోలేక సతమతం అవుతుంటారు. ఎందుకంటే తనకున్న అర ఎకరం లేదా ఎకరం పొలం దున్నటానికి ఎద్దులు వున్న కిరాయిదారుడు రాడు. దానికి కారణం వేరే ఎక్కువ పొలం వున్న వారికి వెళ్తే రోజంతా పని వుంటుంది, కిరాయి పూర్తిగా వస్తుంది. కానీ చిన్న వారి పొలానికి వెళ్తే వారివద్ద పూర్తి కిరాయి తీసుకోవటం కుదరదు. పైగా త్వరగా పని అయిపోతుంది. ఇలాంటి వాళ్ళు ఇద్దరు ముగ్గురు రైతులు కలుసుకుని కిరాయికి మాట్లాడుకున్నా, ఒక్కో పొలంలో వేర్వేరు పనులు వుంటాయి, వాటికి తగిన పరికరాలు తెచ్చుకోవాలి. ఇలాంటి ఇబ్బందులు చాలా వుంటాయి. అటువంటి వారికోసమే మోటార్ సైకిల్‌కు అనుసంధానం చేసుకునే వ్యవసాయ పనిముట్లను వెలుగులోకి తెచ్చింది 'పల్లెసృజన' వాటిని మీరు ఏర్పాటు చేసుకున్నట్లయితే ఆడుతూ పాడుతూ వారి పొలాన్ని మీ మోటార్ సైకిల్‌తో రూపు మార్చే అవకాశంతో పాటు, మీకు గౌరవము, ఉపాధితో పాటు ఎందరికో మేలు చేసిన వాళ్ళవుతారు. ఆలస్యం చేయక వెంటనే మీ ఉపాధి మీరే పొందండి. మీ ఊర్లోనే వుంటూ, మీ ఆనందాన్ని అనుభవిస్తూ, ఇతరులకు సహాయం చేయటం ద్వారా మీ ఉపాధి మీరే కల్పించుకోండి. ఇలా మీ మోటార్ సైకిల్ తోనే చేసే ఎన్నో పరిష్కారాలను మీకు అందించటానికి ఎప్పుడూ సిద్ధంగా వుంటుంది 'పల్లెసృజన'.

ప్రతి గ్రామంలోని యువకులు తమ మోటార్ సైకిల్‌లను గ్రామీణ రవాణాకు ఉపయోగ పడేలా తయారు చేసుకున్నట్లయితే గ్రామస్తులకు కూడా తక్కువ ఖర్చుకే తమ సరుకుల రవాణా అందజేయటంతో పాటు యువత అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటుందని ఆశిద్దాం. ●

**వివరాల కొరకు సంప్రదించండి : వీరరాఘవ రెడ్డి, 8125799904, సుభాష్ చందర్, 9652801700**

# 800 సంవత్సరాల పురాతన ఆయుర్వేద ఔషధం "సర్వ జ్వరహార చూర్ణ"

**తయారీకి కావలసిన పదార్థాలు :**

- శొంఠి, పిప్పళ్లు, మిరియాలు – ఒక్కోటి 20 గ్రా.
- లవంగం, ఏలకులు, జాజికాయ, జాపత్రి, తులసి, దాల్చిన చెక్క – ఒక్కోటి 10 గ్రా.

పై దినుసులన్నీ మెత్తగా పొడి చేసి, పలుచటి వస్త్రంలో కాయిదం (జల్లి) పట్టి ఈ చూర్ణాన్ని తయారు చేసుకుని ఒక సీసాలో ఉంచుకోవాలి. ఏ జ్వరానికైనా ఒక చెంచా చూర్ణము అరగ్లాసు నీళ్ళలో కలిపి, అందులో 50 గ్రా. బెల్లం వేసి ఉడికించాలి. ఆ తర్వాత ఆ ద్రావణాన్ని వడపోసి త్రాగితే అన్ని రకాల జ్వరాలు మెల్లగా తగ్గిపోవడం ప్రారంభం అవుతుంది.

**మూలం :** ఆరోగ్య శతక్; రచయిత : పూజ్యులు నాగరాజు గారు;

**సంప్రదింపులకు :** శ్రీ సాధన్ భట్టాచార్య, ఫోన్ : 9692 40122.

## కోవిడ్-19 రోగులపై ప్రయోగం

ఈ "సర్వ జ్వరహార చూర్ణ" పొడిని శ్రీ భంవర్‌లాల్ దూగర్, ఆయుర్వేద విశ్వ భారతి, సర్దార్ షహర్, రాజస్థాన్‌లో 102 మంది 'కోవిడ్–19' రోగులపై ప్రయోగించడం జరిగింది. తరుపతి బికనీర్ మెడికల్ కళాశాలలో జరిపిన పరీక్షల్లో వీరందరికీ 'నెగటివ్' వచ్చింది.

ఈ చూర్ణం ముఖ్యంగా మన శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంరపొందిస్తుంది. దీని మూలంగా వైరస్ వారి శరీర అంగాలపై ప్రభావం చూపించలేక చనిపోతుందని వైద్యుల అభిప్రాయం.

**ఈ రిపోర్టుపై సంప్రదించడానికి :** రోహిత్ దింగ్రా, ఫోన్ : 99906 64041.

యం.బి.ఎల్.డి. ఆయుర్వేద విశ్వ భారతి, సర్దార్ షహర్, రాజస్థాన్.

## తెలుగు రాష్ట్రాల్లో ప్రయోగాలు

అమరావతికి చెందిన 'పల్లెసృజన' ఇన్నోవేటర్ కె. చంద్రశేఖర్ ఈ చూర్ణం తయారు చేసి కొన్ని వందల మంది 'కోవిడ్–19' రోగులకు ఉపశమనం కలిగించాడు. ఎంతోమందికి చూర్ణం తయారు చేయడం నేర్పించారు.

'పల్లెసృజన' పత్రిక ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు 'వీరరాఘవ రెడ్డి' కుటుంబంలో తన భార్య, కొడుకు, కోడలు, ఇద్దరు మనవళ్ళకు ఫిబ్రవరిలో 'కరోనా' సోకింది. కానీ, ఇతను ఈ చూర్ణాన్ని గత ఒకటిన్నర సంవత్సరాలుగా వాడుతునే వుంటం వల్ల ఇంట్లో అందరినీ కరోనా పలకరించినా, ఇతని దరి చేరలేక పోయిందని ఆయన విశ్వాసం.

## 'పల్లెసృజన' కార్యాలయంలో అందుబాటులో ఈ ఆయుర్వేద ఔషధం



'సర్వ జ్వరహార చూర్ణ' అనే ఆయుర్వేద చూర్ణం ప్రస్తుతం 'పల్లెసృజన' కార్యాలయంలో అందుబాటులో వుంది. కావలసిన వారు కార్యాలయానికి నేరుగా వచ్చి కానీ, ఫోను ద్వారా సంప్రదించి కొరియర్ ద్వారా తెప్పించుకోవచ్చు. వాడవలసిన విధానం చూర్ణం ప్యాకెట్‌తో పాటు పంపబడును.

మీరు సంప్రదించాల్సిన చిరునామా

**'పల్లెసృజన' కార్యాలయము, 77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,**
**సికింద్రాబాద్ - 500 094.**
**ఫోన్ : 040-27111959, సెల్ : 9652801700**

# 'పల్లెసృజన' ఇన్నోవేటర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం "ఇంటింటా ఇన్నోవేటర్" సత్కారాలు

### కడివెండి మహిపాల్ చారి
వరంగల్ జిల్లా.








వరంగల్ జిల్లాకు చెందిన కడివెండి మహిపాల్ చారి ట్రాక్టర్ లోడర్ తయారు చేసినందుకు ఇంటింటా ఇన్నోవేటర్ పురస్కారంతో జిల్లా కలెక్టర్ సత్కరించారు.

### షణ్ముఖ రావు
మహబూబాబాద్ జిల్లా.








మహబూబాబాద్ జిల్లాకు చెందిన షణ్ముఖరావు పొలం దున్నే రైతుకు, పొలంలో పనిచేసే రైతులకు ఎండ, వానల నుంచి రక్షణ పొందేందుకు నీడను తయారు చేసినందుకు ఇంటింటా ఇన్నోవేటర్ పురస్కారంతో జిల్లా కలెక్టర్ సత్కరించారు.

### ముళ్ళపూడి సత్యనారాయణ
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.








భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ముళ్ళపూడి సత్యనారాయణ ట్రాక్టర్‌కు హైడ్రాలిక్‌తో ఒకవైపు లోతుగా దున్నే పరికరం తయారు చేసినందుకు ఇంటింటా ఇన్నోవేటర్ పురస్కారంతో జిల్లా కలెక్టర్ సత్కరించారు.

### బోశెట్టి భగత్ ప్రశాంత్
పెద్దపల్లి జిల్లా.








పెద్దపల్లి జిల్లాకు చెందిన బోశెట్టి భగత్ ప్రశాంత్ గ్రాస్ కట్టర్, విత్తనాలు వేసే యంత్రం లను తయారు చేసినందుకు ఇంటింటా ఇన్నోవేటర్ పురస్కారంతో జిల్లా కలెక్టర్ సత్కరించారు.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## వ్యవసాయ వ్యర్థాలను ఎరువుగా మార్చే యంత్రం

**సమస్య - పరిష్కారం :**

సేంద్రియ వ్యవసాయ విధానంలో 'కంపోస్టు' ఎరువుకున్న ప్రాధాన్యత మరి దేనికీ లేదు. వ్యవసాయ వ్యర్థాలు, ఇళ్ళలోని చెత్తతో కంపోస్టు చేసుకోవచ్చు అని అందరికీ తెలుసు. కాకపోతే దానికి సాధారణంగా 3-4 నెలల సమయం పడుతుంది. ఈ కాల పరిమితిని తగ్గించే యంత్రాలు విదేశాల్లో మాత్రమే లభించేవి. కానీ 'ఉర్మెల్ సింగ్ ధోన్సీ' అనే రాజస్థాన్‌కు చెందిన ఇన్నోవేటర్ ఈ ప్రక్రియని కేవలం 25 నుండి 40 రోజుల లోపలే చేసే పరికరాన్ని కనుగొన్నాడు. అతను చెప్పినదాని ప్రకారం ఈ యంత్రం ద్వారా కంపోస్టు తయారు చేయటానికి టన్నుకు కేవలం 2 రూపాయలు ఖర్చవుతుంది.

**పరికరం :**

చెత్తను తిరగవేయటం యంత్రం సహాయంతో జరుగుతుంది. ఈ యంత్రాన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోవచ్చు. యంత్రంలో భాగంగా ఒక రోటర్ షాఫ్ట్‌కు కొన్ని బ్లేడ్లు అమర్చబడి వుండి ఆ బ్లేడ్లు తిరుగుతూ చెత్తను తునకలు చేస్తూ, తడి కూడా అందజేస్తాయి.






ఎండాకాలంలో 5 రోజులకోసారి, చలి కాలంలో 7 రోజులకోసారి చొప్పున 5-6 సార్లు చెత్త కుప్పపైకి ఈ యంత్రాన్ని తోపుకుంటూ వెళ్ళితే చాలు అదే చెత్తను కలిపి నీరు అందించటం వల్ల ఆ చెత్త కంపోస్టుగా తయారవుతుంది.

**సాంకేతిక వివరాలు :**

- 400 టన్నుల చెత్తను ఒక గంటలో కలియ గలుపుతుంది.
- గంటకు మూడున్న నుంచి 4 లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.
- 50 హెచ్‌పి ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చెయ్యవచ్చు.
- రోటర్ 16 అంగుళాల వ్యాసం, 9 అడుగుల పొడవు కలిగి వుండి, 9 బ్లేడ్లు అమర్చబడి వుంటాయి.
- క్రోమ్ స్టీల్‌తో తయారు చేయబడిన ప్రత్యేకమైన గేర్‌బాక్స్ సహాయంతో వేలకొద్ది టన్నుల వ్యవసాయ వ్యర్థాలను, గృహ వ్యర్థాలను కంపోస్టుగా తయారు చేసుకోవచ్చు.
- రోటర్‌ను క్రిందకు, పైకి కదపటానికి అనువుగా హైడ్రాలిక్ సదుపాయం కలదు.



❀ 2000 లీటర్ల సామర్థ్యమున్న నీటి ట్యాంకు అమర్చబడి వుంటుంది.

**ముఖ్యాంశాలు :**

❀ ఈ యంత్రం సహాయంతో 120 నుండి 150 రోజుల్లో తయారయ్యే కంపోస్టు 25-40 రోజుల్లోనే తయారు చేయవచ్చు.

❀ పేడ కంపోస్టుకన్నా ఈ వర్మి కంపోస్టులో పోషక విలువలు ఎక్కువ.

❀ ఈ పనంతా ఒకేవ్యక్తి చేసుకోవచ్చు.

❀ నిరుద్యోగులకు, ఎక్కువ కంపోస్టు అవసరమైన వారికి ఇది ఎంతో అనువైన యంత్రం.

❀ నలుగురు నిరుద్యోగులు ఈ యంత్రాలను పట్టణాల్లో ఏర్పాటు చేసుకుంటే వారికి ఉపాధి, రైతులకు తక్కువ ధరలో సేంద్రియ ఎరువు అందించటంతో పాటు, పట్టణాలను చెత్త దుర్గంధం నుండి కాపాడి ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చు.

**పురస్కారాలు :**

❀ ఇన్నోవేటర్ 'గుర్మిల్‌సింగ్ ధోన్సీ' కి ఎన్‌ఐఎఫ్ వారు 2012లో 'ఉత్తమ సాంప్రదాయ జ్ఞానం' బహుమతిని అందజేశారు.

## పాలు పితికే యంత్రం

**సమస్య - పరిష్కారం :**

డెయిరీ ఫారంలు, ఎక్కువ పాడి పశువులు వున్న వారికి పశువులనుండి పాలు పితకడం ప్రధాన సమస్య. నేర్పరులైన కూలీలు లభించటం కూడా దుర్లభంగా మారుతోంది. పైగా చేత్తో పితకడం అన్నది ఆరోగ్యకరమైన పద్ధతి కాదు అన్న భావన ప్రబలు తోంది. పాలు పితకటానికి యంత్రాలున్నా, చాలా ఎక్కువ పెట్టుబడి కావాల్సి వస్తోంది. ఈ సమస్యకి పరిష్కారంగా కర్నాటకకు చెందిన 'రాఘవ గౌడ' తక్కువ





ఖరీదులో పాలు పితికే యంత్రాన్ని తయారు చేశాడు.

**పరికరం :**

ఇది చేతితో నడిపే విధంగా, యంత్ర సహాయంతో పని చేసే విధంగా రెండు రకాలుగా తయారు చేశాడు. తక్కువ పాడి పశువులున్న వారు కూడా దీనిని కొనుగోలు చేసి ఉపయోగించుకోవచ్చు. దీన్ని ఉపయోగించటం చాలా సులభం. స్త్రీలు కూడా సులభంగా ఉపయో గించుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

❀ ఈ యంత్రం తయారీలో మేలురకపు స్టీలు ఉపయోగించ బడినది.

❀ 18 కిలోల బరువున్న చేతితో నడిపే ఈ యంత్రం సహాయంతో ఒకసారి, ఒక పశువు నుండి పాలు పితకవచ్చు.

❀ సెమీ ఆటోమేటిక్‌లో కరెంటు లేదా బ్యాటరీతో పని చేసే యంత్రాలు కూడా అందుబాటులో వున్నాయి.

**ముఖ్యాంశాలు :**

❀ ఒక పశువుకు పాలు పితకటానికి కేవలం 4 నుండి 6 నిమిషాలు పడుతుంది.

❀ నిమిషానికి ఒకటిన్నర నుండి 2 లీటర్ల పాలు పితక వచ్చు.

❀ చేత్తో పాలు పితకడం వుండదు కనుక పూర్తిగా ఆరోగ్య ప్రదాయమైనది.

❀ పశువుకు ఎటువంటి హాని కాని, అసౌకర్యం కాని కలగదు.

❀ ఎటువంటి ఖర్చు లేకుండా 8 నుండి 10 సంవత్సరాల వరకు పని చేస్తుంది.

**పురస్కారాలు :**

❀ 2005లో ఇన్నోవేటర్ రాఘవ గౌడకు ఈ యంత్రం కనిపెట్టినందుకుగాను ఎన్‌ఐఎఫ్ వారు నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతులమీదుగా పురస్కారం అందించడ మైనది.

**పరికరాల కొరకు సంప్రదించండి :**

**సుభాష్ చందర్, 9652801700**
**Website: www.nifindia.org**



# gian

## Submit your Ideas, Innovations, Prototypes

## హనీబీ నెట్‌వర్క్
## క్రియేటివిటీ & ఇన్‌క్లూసివ్ ఇన్నోవేషన్ అవార్డులు
## HBN CRIIA

మీవద్ద మనుషులు, పశువులు, పర్యావరణం
ఎదుర్కొనే దైనందిక సమస్యలను
పరిష్కరించే సృజనాత్మక, సాంప్రదాయ
పద్ధతులు లేదా ఆలోచనలు ఉన్నాయా?

**మీ ఆలోచనలను, ఇన్నోవేషన్‌లను, నమూనాలను పంపండి**

**ఎవ్వరైనా దరఖాస్తు చేసుకోవచ్చు!**


మీ దరఖాస్తులను ఈ చిరునామాకు పంపండి...
Email : gian@gian.org or post them to
GIAN, Bungalow No. 1,
Sattellite Complex, Nr. Mansi Crossroads,
Satellite, Ahmedabad – 380 015. Gujarat
Call us at : 079 26769686



మోటార్ సైకిల్‌తో పని చేసే పొలం దున్నే యంత్రం
మన్సుఖ్‌భాయ్ జగాని, గుజరాత్

ఎంపికైన ఆలోచనలు, నమూనాలను **HBN CRIIA** పురస్కారంతో సత్కరించటంతో పాటు, అవి కార్యరూపం దాల్చటానికి తగ్గ ఆర్థిక / ఇతర సహాయం కూడా చేయబడుతుంది.

ఎంత ఎత్తున్న విద్యార్థులైనా నీళ్ళు త్రాగటానికి వీలుగా వాలుగా ఏర్పాటు చేసిన కుళాయిలు.
ఛాయా ఠాకూర్, గుజరాత్.



**చివరి తేది**
**31 ఆగస్టు, 2021**
last date

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

(హనీబీ ఆంగ్ల పత్రిక సౌజన్యంతో)

27301

**పశువులకు తగిలిన గాయాలు మాన్పడానికి :**

పొలంలో పని దున్నేటప్పుడు, అడవులలో తిరిగేటప్పుడు ఇతరత్రా పశువులకు గాయాలు కావడం సర్వసాధారణం. సరియైన సమయంలో సరియైన చికిత్స చేయకపోతే అవి కురుపులుగా మారి ప్రమాద స్థాయికి చేరే అవకాశముంది. పశువుకి కూడా చాలా బాధగా వుంటుంది. దీనికి రకరకాల మందులు వాడినా తమిళనాడు తిరుచ్చి ప్రాంతానికి చెందిన 'పురై కొక్కలన్ వెలంకపట్టయ్' అనే రైతు ఒక సులభమైన చిట్కా వాడుతూ వుంటాడు.




పశువులకు గాయం అయినపుడు అతను 'బొక్కెన ఆకు' గుప్పెడు తీసుకుని మెత్తగా నూరి ఆ ముద్దను గాయంపై వేసి కట్టు కట్టాలి. ఇలా రోజుకు ఒకసారి చొప్పున మూడు రోజుల పాటు చేస్తే గాయం నయమవుతుంది అంటారు ఈయన.

27304

**పశువులలో కాలు వాపులు తగ్గటానికి :**

పశువులకు నడకలో కాలు బెణికినప్పుడు వాపు వచ్చే అవకాశముంటుంది. అప్పుడు పశువు నడవలేక బాధ పడుతుంటుంది. ఆ వాపు త్వరగా తగ్గటానికి తమిళనాడుకు చెందిన రైతులు ఒక చిట్కాను ఉపయోగిస్తుంటారు.

వారు 'సన్న జముడు' ఆకులను ఈనెలు లేకుండా తీసి, అందులో కొద్దిగా వాము కలిపి ముద్దగా నూరి ఆ మిశ్రమాన్ని 50 మి.లీ. వేపనూనె లో మరిగించి, చల్లారిన తర్వాత పశువుకు వాపున్న కాలికి కట్టుగా కడితే వాపు త్వరగా తగ్గుతుండటం తో ఈ పద్ధతిని విరివిగా ఉప యోగిస్తూ వుంటారు.



27307

**రసంపీల్చే పురుగులు, చీడల నివారణకు సేంద్రియ మందు :**

ఎక్కువగా కూరగాయల మొక్కలు మరియు ఇతర పంటలపై రసంపీల్చే పురుగు సోకిందంటే దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశముంటుంది. వీటికి సరియైన సమయంలో నియంత్రణ మార్గాలను ఉపయోగించడం ఎంతో అవసరం. గుజరాత్ రాష్ట్రానికి చెందిన చోటా ఉదేపూర్‌లోని 'రవిదాస్‌భాయ్ రాందాస్ భాయ్ రత్వా'



అనే రైతు ఒక సేంద్రియ పద్ధతిలో తయారు చేసుకున్న మిశ్రమాన్ని వాడుతూ వుంటాడు. దీనికతను 5 కిలోల వేప ఆకులు, 2 కిలోల జిల్లేడు ఆకులు, మొగ్గలు, పూలను సేకరించి, వాటికి ఒక కిలో 'చెంగ నార', ఒక కిలో తక్కెల ఆకు, ఒక కిలో అడ్డసరం ఆకులు, ఒక కిలో మెంతుల పొడిని కలిపి 25 లీటర్ల గోమూత్రంలో కలిపి 15 రోజుల పాటు గాలి చొరబడకుండా మూత బిగించిన డ్రమ్ములో వేసి మురగబెడతాడు. తర్వాత దీన్ని వడగట్టి, 15 రోజులు పాతబడిన పులిసిన మజ్జిగలో కలిపిన తర్వాత 14 లీటర్ల నీటిలో ఒకలీటరు ఈ మిశ్రమాన్ని కలిపి 6 రోజులకోసారి చొప్పున రెండు లేదా మూడుసార్లు పంటలపై పిచికారి చేస్తాడు. ఇలా చేయటం వల్ల రసంపీల్చే పురుగులు, ఇతర చీడల పీడ కూడా వదులుతుంది అంటారీయన.

27311

**పశువుల పేగులలో నులిపురుగుల నివారణ చికిత్స :**

పశువులలో ముఖ్యంగా దూడలలో నులిపురుగుల తాకిడి ఎక్కువగా వుంటుంది. ఇలాంటప్పుడు పశువులు, దూడలు ఎక్కువగా పారుకుంటూ వుంటాయి. ఈ నులిపురుగుల నివారణకు గుజరాత్‌కు చెందిన 'కమలాబా పున్సీస్ జాలా' అనే మహిళా రైతు ఒక చికిత్సను ఉపయోగిస్తూ వుంటుంది. ఆమె 200 గ్రా. గరిక గడ్డిని తీసుకుని మెత్తగా నూరి నీటితో కలిపి ఆ ద్రావకాన్ని రోజుకి రెండుసార్లు చొప్పున 3 రోజులపాటు పశువుకు తాపిస్తుంది. దీంతో నులిపురుగులు నివారించబడతాయి అంటుందామె.

దీనికే ఆమె మరో పద్ధతిని కూడా ఉపయోగిస్తూ వుంటుంది. 'తెల్ల దురదగొండి' కాయలను తీసుకుని మెత్తగా నూరి పులిసిన మజ్జిగలో కలిపి పశువు చేత తాగిపిస్తుంది. ఈ పద్ధతి కూడా సమర్థవంతంగా పని చేస్తుంది అంటుందీమె.



**27309**

**పత్తిలో గులాబీ రంగు పురుగుల నివారణకు :**

ప్రత్తి పంటలో గులాబిరంగు పురుగు ఆశించినచో అవి కాయలలో తమ స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని వుంటాయి కనుక ఆ కాయ ప్రత్తి బాగా పగలదు, విత్తనాలను ఈ పురుగులు తినేస్తాయి కనుక పత్తి తూకం రాదు, నాణ్యత కూడా ఉండదు. దీని నివారణకు గుజరాత్‌కు చెందిన 'నాబ్జీభాయ్ దెత్రోజా' అనే రైతు సేంద్రియ పురుగు మందును కనుగొన్నాడు.

ఇతను దీని నివారణకు గోమూత్రము, వేప కాయలు, కుంకుడు కాయలను ఉపయోగిస్తాడు. ఈ మిశ్రమం తయారు చేయటానికి అతను 5 కిలోల ఎండిన వేప కాయలను పొడిగా చేసి, అందులో 500-700 గ్రా. కుంకుడు కాయల పొడిని కలిపి ఈ మిశ్రమానికి 10 లీటర్ల గో మూత్రంను జోడించి, ఆరు రోజుల పాటు మురగబెట్టిన తర్వాత దీన్ని వడగట్టి 250 మి.లీ. మిశ్రమాన్ని 15 లీటర్ల నీటిలో కలిపి ప్రత్తి పంటపై ఉదయం, సాయంత్రం పిచికారి చేస్తాడు. ఇదే మిశ్రమాన్ని బెండ పంటపై కూడా వాడి మంచి ఫలితాలను పొందాను అంటున్నాడు నాగ్జీభాయ్.



**37310**

**పశువులలో గాలికుంటు వ్యాధి నివారణకు ఔషధం :**

పశువులలో గాలికుంటు వ్యాధి సర్వ సాధారణంగా వచ్చే వ్యాధి. ఈమధ్య కాస్త తగ్గినా, ఇది భయంకరమైన అంటువ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువుల కాలి గెట్టెలలో తీవ్రమైన పుండ్లు ఏర్పడుతాయి. పశువు నోటినుండి ఎప్పుడూ తీగలు తీగలుగా జొల్లు కారుతూ వుంటుంది. పశువు నీరసించి పోవడం, నడవలేక పోవటం, మేత సరిగ్గా మేయలేక పోవటం దీని లక్షణాలు. ఇది గాలిలో వ్యాప్తి చెందే భయంకరమైన అంటువ్యాధి.

దీని నివారణకు కేరళ రాష్ట్ర రైతులు వేపనూనెతో పుండ్లను శుభ్రం చేసిన తరువాత వాటిపై పసుపు, కర్పూరం, వెల్లులి, వరి తవుడులను టేకు నూనెలో కలిపి గెట్టెలలో ఏర్పడ్డ పుండ్లపై పూస్తారు. దీనికి అదనంగా 'వత్సాంది' లేదా 'కరీం జీరకం' మాత్రలను పశువుకు ఇస్తే మంచి ఫలితం వుంటుంది.



## ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 1,000/-లతో 5 సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక వారి గ్రామాలకు వచ్చే ఏర్పాటు చేస్తారు. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని అన్ని గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి - 'పల్లెసృజన'ను బహూకరించండి! **మీవాళ్ళకు మీరిచ్చే అత్యుత్తమ బహుమతి 'పల్లెసృజన'**

● మీ నాన్నగారి పుట్టినరోజు ● మీ స్నేహితుడి పెళ్ళి ● మీ సహోద్యోగి రిటైర్మెంట్ ● మీ పిల్లలు ఫస్ట్ క్లాస్‌లో పాసైతే



సందర్భం ఏదైనా ఆచారం, సాంప్రదాయం ప్రకారం ప్రతి సందర్భంలో ఓ బహుమతి ఇస్తూ వుంటారు. దానికెంత ఖర్చు చేయాలి? అసలు బహుమతి ఏమివ్వాలి? అన్నవి ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారు.

❀ ఇచ్చిన బహుమతి ఆ సందర్భంలోనే ఆనందాన్ని పంచేదిగా కాకుండా ❀ అందరూ ఇచ్చిన దానికన్నా భిన్నంగా....

❀ జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పంచేది, పెంచేదిగా ఉండాలంటే.....?

బహుమతి ఇచ్చిన వారికే కాక, తీసుకున్న వారితో పాటు, నలుగురికీ పనికి వచ్చే విధంగా ఉండాలి. 'పల్లెసృజన' పత్రిక మన పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో దాగివున్న విజ్ఞాన సంపదను వెలికి తీసి, ప్రస్తుత నవ సమాజానికి ఉపయోగపడే విధంగా చేయటానికి పాటు పడుతుంది.

**'పల్లెసృజన' చందా వివరాలు ఈ పత్రిక చివరి పేజీలో ఉంటాయి**

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

**స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.**

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 13 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 12వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడ్డ ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెలికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2023** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.
Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in

సూచన : వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040–27111959) సంప్రదించండి.

తెలుగు అనువాదకుడు : అర్విణి రాజేంద్ర బాబు, సంపాదకుడు : కుప్పా వేంకట కృష్ణమూర్తి. I SERVE, హైదరాబాద్ వారి సౌజన్యంతో....



# వృక్షాయుర్వేదము

(అనేక అనుబంధవ్యాస సహితము)

## సురపాలుని సంస్కృత గ్రంథానికి తెలుగు అనువాదము

కాల, ప్రాంతాలకు అతీతంగా శాస్త్ర విజ్ఞాన జిజ్ఞాస మానవాళిని అంటిపెట్టుకునే వుంది. ప్రాచీన భారత దేశంలో వివిధ రంగాలలో విశేష కృషి చేసిన మహనీయులు విజ్ఞానాన్ని బహు ముఖాలుగా విస్తరించే ప్రయత్నం చేసిన ఆలోచనాపరులు కోకొల్లలు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, చరకుడు, సుశ్రుతుడు, భాస్కరుడు మొదలైన వారు ఖగోళము, గణితము, వైద్యము లాంటి శాస్త్రాలలో తమ పరిశోధనల ద్వారా కొన్ని మైలురాళ్ళను సృష్టించారు. ఆ కోవలోకి చెందిన వారే 'సురపాలుడు'.

వృక్ష శాస్త్రంలో నిగూఢమైన విషయాలను ఎన్నింటినో పరిశోధించి, అపురూపమైన వృక్ష వైద్య రహస్యాలను గ్రంథస్తం చేసినవాడు సుర పాలుడు. మొక్కల లక్షణాలు కూడా మానవుల శరీరాన్ని పోలి వుంటుందన్న శాస్త్ర పరిజ్ఞానాన్ని ఆవిష్కరించినవాడు సురపాలుడు. వృక్ష శాస్త్రంలో విశేషమైన కృషి చేసిన ఈ మహనీయుడి గురించిన సమాచారం ఇటీవలి వరకు మన దృష్టికి రానేలేదు. ఆయన రచించిన "వృక్షాయుర్వేదం" అన్న గ్రంథం ఇంగ్లాండులోని ఒక గ్రంథాలయంలో ఇటీవలే బయట పడింది. ఆ పుస్తక ఆంగ్లానువాదం 'ఏసియన్ అగ్రో హిస్టరీ ఫౌండేషన్ (ఎఏహెచ్ఎఫ్), హైదరాబాద్ వారు 1996లో ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వృక్ష శాస్త్రం పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా పరిశోధకులకు, విద్యార్థులకు, రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో 'ఐ-సర్వ్', హైదరాబాద్ వారు 2015 లో తెలుగు అనువాద ప్రక్రియకు ఉపక్రమించడం జరిగింది.

ఈ గ్రంథాన్ని 'పల్లెసృజన' పాఠకులకు అందించాలన్న సంకల్పంతో ఈ సంచికనుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం. ఈ గ్రంథంలోని మహత్తరమైన జ్ఞానాన్ని పాఠకులు అవగాహన చేసుకుని, ఆచరిస్తారని ఆశిస్తున్నాం. -ఎడిటర్.

43. బీజపు రకము (మాదీ ఫలము) పున్నాగము, సంపెంగ, మామిడి, అతిముక్తకము (గురువింద), ప్రియంగువు (పిప్పలి), దానిమ్మ మున్నగునవి సాధారణ నేలల్లో బాగా పెరుగుతాయి.

44. ఐశ్వర్యం, విధి, పరిపాలకుడు అనుకూలంగా ఉంటే ఏ పంట అయినా ఎక్కడయినా, ప్రత్యేక కృషితో బాగానే వృద్ధిలోకి వస్తుంది.

ప్రత్యుత్పత్తి :

45. వనస్పతి, ద్రుమము, లత, గుల్మము అనేవి నాలుగు రకాలయిన మొక్కలు. అవి విత్తనాలు, కాడ లేక దుంపల నుండి మొలుస్తాయి. ఆవిధంగా మూడు రకాలుగా మొక్కలను పెంచవచ్చు.

46. పూలు లేకుండా ఫలాలు ఇచ్చేవి వనస్పతులు. పండ్లతో పాటు పూలు కూడా పూచేవి ద్రుమాలు.

47. తీగలతో వ్యాపించే వాటిని "లత"లు అంటారు. (అవి పాకుతూ పెరుగుతాయి) చిన్నగా ఉండి కొమ్మలు గల వాటిని "గుల్మములు" (పొదలు) అంటారు.

48-49. నేరేడు, సంపంగి, పున్నాగ, నాగకేసరి, చింత, వెలగ, రేగు, మారేడు, కంభకారి, ప్రియం (పిప్పలిము), పనస, మామిడి, మధుకము (ఇప్ప), కరమరము (కలివె) మున్నగునవి విత్తనాల నుండి మొలకెత్తుతాయి. తంబులి సిందువారము (వావిలి), తగరము (నందివర్ధనము) మున్నగునవి కాండము నుండి పెరుగుతాయి.

50. పాటల (కలిగొట్టు), దానిమ్మ, ప్లక్షము (జువ్వి), గన్నేరు, మర్రి, మల్లిక (మల్లె), మేడి కుందము (మొల్ల) మున్నగునవి విత్తనాల ద్వారా మరియయు కాండము నుండి మొలకెత్తుతాయి.

51. కుంకుమ, ఆర్ద్రము (అల్లము), రసోనము (వెల్లుల్లి), అలకంద మొదలైనవి గడ్డల నుండి పెరుగుతాయి. ఏలకి, పద్మము, కలువ మున్నగునవి విత్తనాల నుండి, గడ్డల నుండి కూడా పెరుగుతాయి.

52. సహజ రీతిలో సరైన ఋతువులో పక్వం చెందిన పండును ఎండ బెట్టి విత్తనాలు తీయాలి. ఈ తర్వాత వాటిపై పాలు చిలుకరించి, అయిదు రోజులు ఎండబెట్టాలి. తదుపరి "విడంగా"లతో కలిపిన ఆవగింజలతో పొగబెట్టాలి.

53. పాలు చిలకరించి, "బృహతి" (వాకుడు) గింజలతో కలిపిన ఆవాలను మండించి, ఆ బూడిదను పూసి ఆవుపేడ రాసి, ఎముకలోని మూలుగతో పొగబెట్టినచో విత్తనాలు ఆలస్యం లేకుండా వెంటనే మొలకెత్తుతాయి.

54. పాలు చికరించి, ఆవు పేడను బాగా మర్దించి, తేనె మరియు విడంగాలతో అలికితే విత్తనాలు తప్పనిసరిగా మొలకెత్తుతాయి.

55. పాలలో నానబెట్టి, ఆ తరువాత నీడలో ఆరబెట్టి, ఆపై బృహతి (వాకుడు), తిల (నువ్వులు), పద్మనాళం (బోలుగా వున్న తామర పువ్వు కాడ) కలిపిన చూర్ణాన్ని ఆవాలతో కలిపి దొర్లించిన విత్తనాలు నాడటానికి ఉత్తమమైనవి అని నిపుణుల అభిప్రాయం.

56. మామిడి, నేరేడు, పనస విత్తనాలు తడిగా ఉండి పైవిధంగా చికిత్స చేయబడినప్పుడు నాటడానికి ఉత్తమమైనవి. "క్షీరిక, (పాలచెట్టు), "వకుల" (పొగడ) విత్తనాలు ఆరబెట్టి పైవిధంగా చికిత్స చేయబడి కొనలు త్రుంచి వేయబడితే నాటడానికి ఉత్తమమైనవి.

57. ఆకులతో చేసిన ఒక దొన్నెలో ముడివేయబడ్డ బెల్లం దట్టించిన నీళ్ళను చిలకరించి, ఆ దొన్నెను భూమిమీద ఉంచి మూడు రోజులు వరుసగా మంటతో వేడిగా ఉంచి బయటకు తీసిన "ఉర్వారు" (దోస) విత్తనాలు నాటుటకు అనువైనవి.

58. ఈవిధంగా చికిత్స చేసి నిల్వ ఉంచిన విత్తనాలు ఉపయోగించటానికి చాలా మంచివి. ఆ విత్తనాల నుండి మొలకెత్తిన చెట్లు ఎల్లప్పుడూ మంచి నాణ్యమైన పుష్పాలను, ఫలాలను ఇస్తాయి.

59. తోట యజమాని స్నానమాచరించి, శుభ్రమైన బట్టలు కట్టి, దైవపూజ చేసి, తన ఉపదేశకుడు లేదా గురువుకు వందనాలు తెలిపి, అర్హత గల వాడికి డబ్బో, భూదానమో చేసి, వాస్తు దేవతార్చన చేసి, మొదట తాను సొంతంగా కొన్ని విత్తనాలు నాట వలెను. ఆ తర్వాత తోటలో పనిచేసే సేవకులు నాటవచ్చును.

60. విత్తిన తర్వాత నేలను గడ్డితో కప్పి, పాలతో కలిపిన నీళ్ళను చిలుకరించాలి. అవి మొలకెత్తిన తర్వాత కూడా నీళ్ళను బాగా చిలుకరించాలి. నేల ఆరిపోవడానికి వీలుగా గడ్డిని తొలగించాలి.

61. పున్నమి రోజు, శుక్లపాడ్యమి, పంచమి త్రయోదశి రోజులు విత్తటానికి మంచి రోజులు. సోమవారం, బుధవారం, గురువారం, శుక్రవారం అనువైనవి.

62. విశాఖ, మృగశిర, మూల, చిత్త, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, అనురాధ, జ్యేష్ఠ, కృత్తిక నక్షత్రాలు మంచివి. స్థిరలగ్నం మంచిది.

63. ఆ తర్వాత బాగా చదునుగా వుండి కుప్పలు కుప్పలుగా పువ్వులు పడివున్న అంతకు ముందు నువ్వులు కాని, మినుములు కాని పండని పొలంలో ఆ మొలకలను నాటాలి.

64. రెండు మొక్కల మధ్య పధ్నాలుగు మూరల దూరం ఉంచితే సామాన్యంగాను, పదహారు మూరల దూరం ఉంటే మధ్యస్థంగానూ, ఇరవై మూరల దూరం వుంటే ఉత్తమంగానూ చెట్లు కాస్తాయి. మంచి ఫలాలనిస్తాయి.

65. రెండు పొదల మధ్య నాలుగు లేదా అయిదు మూరల దూరం వుండాలి. పోకచెట్లు లాంటివయితే జాగ్రత్తగా రెండు లేక మూడు మూరల దూరం ఉండేలా చూసుకోవాలి.

66. బాగా దూరంగా నాటితే బలమైన గాలుల నుండి ప్రమాదం వాటిల్లే అవకాశం వుంది. మరీ దగ్గరగా నాటినట్లయితే పంట దిగుబడి చాలా తక్కువగా వుంటుంది. కాబట్టి, మంచి దిగుబడి రావాలంటే మొక్క నాటేటప్పుడు మొలకకు, మొలకకు మధ్య దూరం సరిగా ఉండేలా చూసుకోవాలి.

67. మొక్కలు నాటడానికి ముందే గుంతలు తవ్వి పెట్టుకోవాలి. పొడవు, వెడల్పు, లోతు అన్నీ సమానంగా ఒక మూర వుండాలి. గుంతలు సరిగ్గా ఆరాలి ఆవు ఎముకలు, ఆవు పేడలతో గుంతలు నింపి, వాటిని మండించాలి.

68. బూడిద చల్లబడ్డ తర్వాత దానిని తీసివేసి "కుణపజలం" (ఎరువు ద్రావకం) చల్లి గోతులను మంచి మట్టితో కప్పివేయాలి.




69. "మామిడి", "దానిమ్మ", "గుమ్మడి", "అలంబుక" లకు విత్తనాలు విత్తితే మంచిదే కాని మొక్కలు నాటితే ఇంకా మంచిది.

70. ఎక్కువగా సాగుబడిలో వున్న సారవంతమయిన భూమిలో "త్రపూస" (చేదు దోస) విత్తనాలుగాని, మరే ఇతర కూరగాయల విత్తనాలు గాని అడపదడప నాటడం ఉచితం.

71. ఈ పొలాల్లో "కుంకుమం", "మరువకం", "దమనకం" మొక్కలను చిన్న చిన్న పరిమాణాలలో ఆ విధంగానే పండించాలి.

72. పెద్ద పరిమాణంలో వున్న విత్తనాలు ఒక్కొక్కటే నాటాలి. చిన్న చిన్నవి అయితే ఎక్కువ సంఖ్యలో నాటాలి. "నారింజ" విత్తనాలను చేతితో ఏటవాలుగా నాటవలసి వుంటుంది.

73. ఫణిజయిక (మరువక) విత్తనాలు మొదట మట్టిలో కలపాలి. ఆ తర్వాత ఆవు పేడ కలిపిన నీళ్ళను మెల్ల మెల్లిగా క్రమబద్ధంగా చిలుకరించాలి.

74-75. "షష్టిక" అనేవి 60 రోజుల్లో పండే వరి వంగడాలు సహజంగా బాగా పండిన తర్వా సూర్యరశ్మిలో ఎండబెట్టి అరటిపండు గుజ్జును "షష్టిక" తొడిమెలతో చేసిన తాడుకు బాగా పూసి, ఆ గోతులలోకి అప్పుడప్పుడూ వేస్తూ వుండాలి. ఎండ బాగా కాస్తున్న రోజులలో కొద్ది కొద్దిగా ఎల్లప్పుడూ నీళ్ళను చిలుకరిస్తూ వుంటే "తమాల" (చీకటి) చెట్టులాగా నీలం రంగులో సరిగా మొలకెత్తుతాయి.

76. నార కాండము 18 అంగుళాల పొడవు వుండి, అంత లేతగాను, అంత ధృడంగానూ కాకుండా ఉండాలి. సగం నారను ఆవు పేడతో బాగా అలకాలి. ఆ తర్వాత గోతిలో మూడోవంతు లోతులో నారకాండాన్ని నాటి ఇసుక రేణువులు కలిసిన బురద నీటిని చిలుకరించాలి.

77. "శత పత్రిక" కాండములోని క్రింది భాగం సగం పండిన తర్వాత కార్తీక మాసంలో (వర్షాకాలం తర్వాత) ఎక్కువ పరిమాణంలో నాటి రెండు మాసాలు నీళ్ళలో బాగా నానబెట్టాలి.

78. అవి బాగా ఆకులు తొడిగినన తర్వాత, వాటిని పెరికి ఆషాఢ మాసం (వర్షాకాలం ప్రారంభం)లో ఎక్కడయిన అంటు పెట్టుకోవచ్చును.

79-80. "దానిమ్మ మరియు "గన్నేరు" కొమ్మలు వంచి వేరు దగ్గర తగినంత ఆవుపేడ వేసి నాటిని తర్వాత రెండుమాసాలు క్రమం తప్పకుండా నీళ్ళు పట్టాలి. ఆకులు పెద్దవవడం ప్రారంభమయిం తర్వాత వాటిని మధ్యలో కత్తిరించాలి.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

# క్లిష్టమైన ఇంజనీరింగ్ పనులను సునాయాసం చేసిన

# అ(తి)సామాన్యుడు "మురళీ కృష్ణుడు"



- పల్లె వీరరాఘవ రెడ్డి

ఎంతోమందికి చదువు అబ్బలేదు కానీ ఆలోచనలో మాత్రం ఇంజనీరింగ్ చదివి నిష్ణాతులైన వారికి ఏమాత్రం తీసిపోని అద్భుతాలనే సృష్టించ గలిగిన "సామాన్యులు" మన దేశంలో ఎంతో మంది మరుగున పడివున్నారు. వీరి జ్ఞానాన్ని చూస్తుంటే అబ్బుర పడటంతో పాటు ఆనందాశ్చర్యాలకు గురి చేస్తుంది. ఇటువంటి వాళ్ళను వెలుగులోకి తీసుకు రావటమే 'పల్లెసృజన' ధ్యేయం.

ఈ కోవకు చెందినవాడే విజయవాడ ఆటోనగర్‌లో ఒక వర్క్‌షాప్ నడుపుకుంటున్న "చలమలశెట్టి మురళీకృష్ణ". 37 సంవత్సరాల వయసు గల ఈ యువకుడు చదివింది కేవలం 10వ తరగతి. తండ్రి చలమలశెట్టి రంగారావు, తల్లి హైమావతి, భార్య సౌజన్య, వీరికి ఇద్దరు పిల్లలు. ఒక అబ్బాయి 8వ తరగతి చదువుతుండగా, అమ్మాయి 6వ తరగతి చదువుతోంది. స్వస్థలం 'ఘంటసాల' కానీ ఇతని తండ్రి ఎప్పుడో విజయవాడలోని అశోక్‌నగర్‌లో స్థిర నివాసం ఏర్పరచుకొని జీవిస్తున్నారు. విజయవాడలోని ఆటోనగర్‌లో ఒక దుకాణం ఏర్పాటు చేసుకుని సృజనాత్మకంగా ఆలోచించి, సరికొత్త పరికరాలు తయారు చేస్తూ వుంటాడు మురళీకృష్ణ. 10వ తరగతి పూర్తి చేసిన వెంటనే తన బాబాయి నడుపుతున్న వర్క్‌షాప్‌లోనే 10 సంవత్సలు సుదీర్ఘంగా పని చేసి అన్ని రకాల పనులు చెయ్యటంలో నిష్ణాతుడు అయ్యాడు.

ఆ తర్వాత తానే స్వయంగా వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసుకుని సృజనాత్మకమైన పరికరాలు తయారు చేసి ఇవ్వటంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నాడు ఇతను.

> **చాలా గ్రామాలకు మణిహారాల్లా వున్న కాలువల్లో సాధారణంగా పూడిక (సిల్టు) పెరిగిపోతూ వుంటుంది. 5-10 సంవత్సరాలకు ఒకసారైనా ఈ పూడికను (పేరుకుపోయిన మట్టి, గడ్డి) తీసివేయకుంటే నీటి పారుదల తగ్గి పొలాలకు నీరు అందని పరిస్థితి వస్తుంది.**

**జెసీబీని నీటిలో తేలియాడి పని చేయించిన వైనం :**

ఉత్తరాంధ్ర ప్రాంతంలో నీటి పారుదల కాలువలకు కొదవే వుండదు. ఒకవిధంగా అవే చాలా గ్రామాలకు రవాణా, తాగు, సాగునీటి అవసరాలను తీర్చే అతి ముఖ్యమైనవిగా వుంటూ ఉన్నాయి. అందుకే కాలువ గట్టు వెంట వున్న గ్రామాలు ప్రత్యేకంగా అభివృద్ధి చెంది వుంటాయి. ఆ కాలువల్లో పూడిక (సిల్ట్) పెరిగిపోతూ వుంటుంది. 5-10 సంవత్సరాలకు ఒకసారైనా పేరుకుపోయిన మట్టి తీసివేయకుంటే నీటి పారుదల తగ్గి పొలాలకు నీరు అందని పరిస్థితి వస్తుంది. కాబట్టి ప్రభుత్వాలు ఇటువంటి పనులను కాంట్రాక్టర్లకు అప్పజెపుతూ వుంటాయి. ఈ పూడికను తీయటం అనే పని 'ఇప్పటి వరకు ఒక లెక్క ఇప్పటినుండి ఓ లెక్క' అన్న చందంగా మారిపోయింది. దానికి కారణం ఈ పని ఎంతో శ్రమతో కూడుకున్నది ఇదివరకటిలా కూలీల లభ్యత కరువైంది. ప్రత్యామ్నాయంగా పెద్ద జేసీబీ యంత్రాలు వచ్చినా, కాలవల గెట్లవెంట అవి పూడికను తియ్యగలవే కాని, మధ్యలో తీయటం కుదరదు.

మురళీకృష్ణ తెలివైన కుర్రాడు అని గమనించి పాలకొల్లుకు చెందిన ఒక కాంట్రాక్టర్ మురళీకృష్ణ (కాంట్రాక్టర్ పేరు, ఇన్నోవేటర్ పేరు ఒకటే కావడం యాదృచ్ఛికం) ఈ సమస్యను అతనితో చర్చించి, దీనికి పరిష్కారం ఏమైనా చెయ్యగలవా అని అడిగాడు. దానికి మురళీకృష్ణ ఆలోచించి, చెయ్యగలను, మీరు ఎంత సామర్థ్యమున్న జెసీబీని నీటిలోకి తీసుకు వెళ్తారో చెప్పండి, దాన్ని చూసి, కొలతలు తీసుకుని అది నీళ్ళలోకి వెళ్ళేలా చేస్తాను అన్నాడు. పెద్ద పెద్ద

పనులకు ఉపయోగించే 'హిటాచీ' (ఇదీ కాంట్రాక్టర్‌దే) కంపెనీ వారి యంత్రాన్ని చూపించాడు.

దాని కొలతలు తీసుకుని, దాని బరువు తెలుసుకుని ఆ బరువును మొయ్యగలిగే సామర్థ్యము గల ఒక ఫ్లోట్ తయారు చేశాడు. దీన్ని మురళీకృష్ణ "ఫ్లోటింగ్ షెడ్" అంటాడు. బరువైన ఇనుప ప్లేట్లను దీర్ఘ చతురస్రాకారంలో వెల్డింగ్ చేసి మధ్యలో శూన్యత వచ్చేలా రెండు దీర్ఘ చతురస్రాకారంలో వుండే పొడవాటి డబ్బాలను తయారు చేశాడు. రెండు డబ్బాలను అనుసంధానం చేస్తూ 12 అంగుళాల వ్యాసమున్న ఇనుప పైపులను అమర్చాడు. ఈ రెండు భాగాలను కాలువ వద్దకు తీసుకెళ్ళి అక్కడే అతికించాడు. ఈ డబ్బాలలో కేవలం గాలి మాత్రమే ఉండేలా, అందులోకి ఒక్క చుక్క నీరు కూడా చేరకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఎందుకంటే ఎంత బరువైన ఇనుప డబ్బాలైనా సరే లోపల గాలి వుంటే చాలు అది నీటిలో మునగదు, తేలియాడుతునే వుంటుంది అన్నది ఓడల తయారీ సూత్రం.

ఇలా తయారైన ఫ్లోట్‌ను నీటిలోకి పంపి, మొదట ఎన్నో ఇసుక నింపిన సంచులను వేసి పరీక్షించాడు. బోటు ఏమాత్రం నీటిలోకి వెళ్ళటం లేదు అని నిర్ధారణ చేసుకున్నాక, దానిపైకి జెసిబి యంత్రాన్ని చేర్చారు.

ఈ ఫ్లోట్‌కు మోటారు ఉండదు కనుక దీనికి రెండు పొడవాటి తాళ్ళను కట్టి, కాలువకు గల ఇరువైపుల వున్న గట్లపైన ఇద్దరు లేదా నలుగురు వ్యక్తులు ఆ తాడును పట్టుకుని వుంటారు. దీన్ని అవసరం అనుకుంటే ఆ తాళ్ళతో చాలా సులువుగా ఎక్కడికి కావాలంటే అక్కడికి లాక్కుంటూ తీసుకు వెళ్ళవచ్చునట. ఏమాత్రం బరువుండదు అంటాడు మురళీకృష్ణ. అవసరం అనుకున్నపుడు మనుషులు తాళ్ళతో లాగుతూ వుంటే ముందుకు వెళ్తూ ఫ్లోట్ పైన వున్న జెసిబీ కాలువ మధ్యలో వున్న పూడికను తీసి వేస్తూ వుంటుంది.

యంత్రం కాలువలో పూడిక తీసేటపుడు దాని తొండం (గుంత త్రవ్వే భాగం 'డిగ్గర్' అని కూడా అంటారు)ను ఆధారం చేసుకుని పడవను ముందుకు జరుపుకుంటూ వెళ్ళి పూడిక తీస్తుంది. కాలువ


పూజలు చేసి ప్రారంభిస్తున్న 'ఫ్లోటింగ్ డిగ్గర్'

> ఎంత బరువైన ఇనుప డబ్బాలైనా సరే లోపల గాలి వుంటే చాలు అది నీటిలో మునగదు, తేలియాడుతునే వుంటుంది అన్నది అతను కనుగొన్న సూత్రం. అలా రెండు డబ్బాలను అతికించిన తర్వాత ఆ పడవను నీటిలోకి పంపి, మొదట ఎన్నో ఇసుక నింపిన సంచులను వేసి పరీక్షించాడు. బోటు ఏమాత్రం నీటిలోకి వెళ్ళటం లేదు అని నిర్ధారణ చేసుకున్నాక, దానిపైకి పూడిక తీసే యంత్రాన్ని చేర్చారు.

మధ్యలో (నీటితో నిండి వున్న కాలువ) పూడిక తీసేటపుడు నీటి ప్రవాహం ఏమైనా ఎక్కువైనప్పుడు ఈ తాళ్ళు పట్టుకున్న వ్యక్తులే పడవ నీటి ప్రవాహం వల్ల ఇబ్బంది కలుగకుండా నియంత్రిస్తారు. జెసీబీ తనపని తాను చేసుకుంటూ వెళ్తుంటుంది. అలా కాలువ మధ్యలో పూడికను తీసి గట్లపైన వేస్తుంది ఆ యంత్రం. ఈ పని అంతా చెయ్యాలంటే వేలాది మంది కూలీలతో కూడిన పని. కేవలం 5-10 మంది వ్యక్తులతో చాలా త్వరగా కాలువ పూడిక తీయగలిగారు.

ఇంతటి సమర్థవంతమైన ఆ ఇనుప పడవ తయారు చేయటా నికి మురళీకృష్ణ తీసుకున్నది రూ. 6.5 లక్షలు మాత్రమే. కానీ ఒక్కసారి తీసిన పూడికతోనే ఆ పడవకు పెట్టిన ఖర్చు తీరిపోవటమే కాదు, కాలువను కూడా మనుషులకన్నా అత్యంత శుభ్రంగా, సమర్థవంతంగా, తక్కువ సమయంలో చేయగలిగామని అన్నాడు కాంట్రాక్టర్. దానికి ప్రభుత్వాధికారుల నుంచి కూడా తనకెంతో పేరు ప్రఖ్యాతులు వచ్చాయి అని, దీనంతటికీ కారణం నీ ఆలోచ నా విధానమే అని ఇన్నోవేటర్ మురళీకృష్ణను అభినందించాడు ఆ కాంట్రాక్టరు మురళీకృష్ణ. ఇక్కడ కాంట్రాక్టర్ ధైర్యం మురళీకృష్ణకు తోడైంది. ఇతన్ని నమ్మి 6.5 లక్షల రూపాయలు ఇచ్చి ఆ పడవ తయారు చేయించటం ఒకటైతే, ఎంతో ఖరీదైన ఇటాచీ పూడిక తీసే యంత్రాన్ని నీటిలోని పడవపై కొన్ని టన్నుల బరువున్న జెసిబీని ఈ పడవ తట్టుకుని నిలబడుతుందా లేక నీటిలో మునిగి పోతుందా అని ఎవ్వరి కైనా భయం వేస్తుంది. అలాంటిది ధైర్యంగా తన వాహనాన్ని పడవ పైకి ఎక్కించటం అంటే ఆ ధైర్యాన్ని మాటల్లో వర్ణించలేము. ఇక్కడ ఏమాత్రం చదువుకున్న అర్హత లేని, కేవలం అనుభవం వున్న ఇన్నోవేటర్ సామర్థ్యత వల్ల కాంట్రాక్టర్‌కు వున్న నమ్మకం ఎంతో అభినందనీయం. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనకున్న అనుభవంతో అనుకున్నది సాధించి పెట్టడం ఇన్నోవేటర్ గొప్పదనం.


లోపల గాలి వుండేలా తయారు చేస్తున్న పడవ

ఎంతోమంది నిష్ణాతులైన ఇంజనీర్లే సులువుగా సాధించలేని పనిని ఒక అతి సామాన్యుడు మురళీకృష్ణ చెయ్యటం నీటిపారుదల శాఖ


కోట్ల ఖరీదు చేసే ఫ్లోటింగ్ డిగ్గర్

ఇంజనీర్లను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. ఇంతటి ప్రతిభ దాగి వున్న పునాది స్థాయి ఇంజనీర్లను వెలుగులోకి తెస్తే సమాజం లోని సమస్యల్ని చాలా తక్కువ ఖర్చుతో పరిష్కరించటమే కాదు, ఎటువంటి నిర్వహణా ఖర్చులు కూడా లేని విధంగా చెయ్యగలరు. అంతేకాక, మన దేశీ నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. 'ఆత్మనిర్భర భారత్' అన్న పదానికి పరిపూర్ణత చేకూరుతుంది. ప్రస్తుతం ఈ పరికరం పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో ఉపయోగంలో ఉంది.

**కొలిమితో అవసరం లేని 'ఇండక్షన్ హీటర్':**

మురళీకృష్ణ తన అవసరాల కోసం కొన్ని ఇనుప చువ్వలను వంపు చేయాల్సి వుంటుంది. ఇనుమును నేరుగా కావలసిన వంపులు చేసుకోవచ్చు కానీ, అలా చేయటం వల్ల ఆ ఇనుములోని శక్తి (గట్టితనం) కొంత తగ్గుతుంది. అందుకే పూర్వం నుండి గ్రామాల్లోనైనా, పట్టణాల్లోనైనా వంపులు చెయ్యాలనుకున్నచోట కొలిమిలో వేడి చేసి కావలసిన వంపు తీసుకు వచ్చేవారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కొలిమి మండించి, అందులో ఇనుప చువ్వను వేడి చేసి, కావలసిన వంపు తీసుకు రావాలి అంటే ఎంతో ఖర్చు, శ్రమ, సమయంతో కూడుకున్న పని. కొలిమి వేడి చెయ్యాలంటే బొగ్గులు, ఊక, ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు అవసరం.

ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం కనుగొన్నాడు మురళీకృష్ణ. ఒక ఎలక్ట్రీషియన్ సలహాతో ఒక పరికరం తయారు చేసుకున్నాడు. ఆ పరికరం ద్వారా ఇనుప చువ్వను ఎక్కడ వంపు చెయ్యాలో అక్కడ కేవలం కొన్ని క్షణాలు (నిమిషాలు కూడా కాదు) వుంచితే ఎంత అవసరమో అంతగా వేడి అవుతుంది. అప్పుడు చువ్వను సులభంగా తనకు అవసరమైన విధంగా వంచేసుకోవచ్చు. దీనికి అయ్యే కరెంటు ఖర్చును కొలిమితో చేసే పనితో పోలిస్తే అందులో 10వ శాతం కూడా ఉండదు. అతి తక్కువ ఖర్చుతో, ఇనుప చువ్వ శక్తి క్షీణించకుండా, కావలసిన వంపులను సునాయాసంగా ఒక్కడే తయారు చేసుకుంటాడు మురళీకృష్ణ.

దీని ఖరీదు సుమారు 25 వేల వరకు అవుతుంది కాబట్టి, గ్రామాల్లోని కమ్మరి వృత్తి చేసేవారు కొనుగోలు చేయటం కొద్దిగా కష్టమే.

**ఇతన్ని నమ్మి 6.5 లక్షల రూపాయలు ఇచ్చి ఆ పడవ తయారు చేయించటం ఒకటైతే, ఎంతో ఖరీదైన హిటాచీ పూడిక తీసే యంత్రాన్ని నీటిలోని పడవపై కొన్ని టన్నుల బరువున్న వాహనం బరువును పడవ తట్టుకుని నిలబడుతుందా లేక నీటిలో మునిగి పోతుందా అని ఎవ్వరికైనా భయం వేస్తుంది. అలాంటిది ధైర్యంగా తన వాహనాన్ని పడవ పైకి ఎక్కించటం అంటే ఆ ధైర్యాన్ని మాటల్లో వర్ణించలేము.**

వీరికి ప్రభుత్వం లేదా, సామాజిక సంస్థలు ఇటువంటి పరికరాలను ఏర్పాటు చేయగలిగితే, గ్రామాల్లో పర్యావరణం కాపాడటంతో పాటు, వారి ఖర్చులను కూడా తగ్గించినట్లు అవుతుంది. పైగా నాణ్యతలో ఎలాంటి తరుగుదల లేకుండా ఇంకా మంచి మంచి ఆలోచనలు చేసి, కొత్త కొత్త పరికరాలు తయారయ్యేందుకు దోహద పడిన వారవుతారు.

ఎందుకంటే 'కమ్మరి వృత్తి' వారే ప్రథమ ఇంజనీర్లు అని నమ్ముతుంది 'పల్లెసృజన'. రైతు తమ వ్యవసాయ పని ముట్లలో ఏదైనా చిన్న లోపం వుంటే దాన్ని ఎలా సరిదిద్దాలో సతమతం అవుతూ తనవల్ల కాక కమ్మరి వద్దకు తీసుకు వెళ్తే, అతను కొద్ది క్షణాల్లోనే రైతుకు అనుకూలంగా దాన్ని చేసి ఇస్తాడు. గ్రామాల్లో మరీ ముఖ్యంగా వ్యవసాయ పనిముట్లలో లోటు పాట్లను క్షణాల్లో సరిదిద్దగల సమర్థత గల చదువు రాని ఇంజనీర్లు 'కమ్మరి' వృత్తిదారులు. దీనికొక్కటే ఉదాహరణ ఎన్ని వేల సంవత్సరాల క్రితం తయారు చేశారో తెలీదు 'నాగలి'. ఇప్పటికీ దానికి ప్రత్యామ్నాయం కనుగొనలేదు ఏ ఇంజనీరు. ఒకవేళ నాగలి వేరే రకంగా తయారు చేసి వుండవచ్చు కానీ, దానికి మూలం మాత్రం కమ్మరి వారు తయారు చేసిన నాగలే అని గ్రహించాలి. ఇటువంటి కులవృత్తిని ప్రోత్సహిస్తే కొన్ని వందల రకాల పనిముట్లను ఈనాటి సాంకేతికతకు అనుగుణంగా కూడా వీరు తయారు చేసి ఇవ్వగలరు. తద్వారా వేలాది కోట్ల రూపాయలు రైతాంగానికి మిగిలి, ఆర్థికంగా పుంజుకునే విధంగా గ్రామాలు తయారౌతాయి. అటువంటి వారికి ఇలాంటి 'ఇండక్షన్ హీటర్' ఆవశ్యకత ఎంతైనా వుంది అన్నది 'పల్లెసృజన' అభిప్రాయం.

**టాయిలెట్ బ్రష్షుల తయారీకి తాటిచెట్టు ఈనెలు తీసే యంత్రం:**

తాటిచెట్టు 'కల్పవృక్షం' అన్న నానుడి తెలియని తెలుగు వారు ఉండరు. ఆ తాటిచెట్టు వల్ల కలిగే ఎన్నో లాభాల్లో చీపుర్లు, బ్రష్షులు తయారు చేసే వారికి కూడా ఉపయోగ పడుతోంది. తాటిచెట్టు ఆకులు ఎండి, అవి క్రిందకు రాలిన తర్వాత లేదా వండిన ఆకులను తొలగించి, ఈనెలు మాత్రమే వుండేలా చేస్తారు. వీటిని అవసరమైన సైజుల్లో కత్తిరించుకుని, వీధులను ఊడ్చే


రేయింబవళ్ళు శ్రమించి చేస్తున్న పడవ

చీపుర్లు, ఇళ్ళల్లో బాత్ రూంలను శుభ్రం చేసేందుకు బ్రష్‌లు, ఇలా రకరకాల ఉత్పత్తులను తయారు చేస్తారు ఈ తాటిచెట్టు చీపుర్లు బయలు ప్రదేశాల్లో శుభ్రం చేయటానికి చాలా రోజులు మన్నిక గలవన్నది నిర్వివాదాంశం. గతంలో దాదాపు ప్రతి గ్రామంలో చీపుర్లు తయారు చేసే 'ఎరుకలి' సామాజిక వర్గం వారు వుండేవారు. ఆధునిక కాలంలో వారు కూడా గ్రామాలను వదిలి పట్టణ బాట పట్టారు. అందులో కొంతమంది పట్టణాల్లోనే పెద్దయెత్తున చీపుర్లు తయారు చేసి వాటిని కూడా వ్యాపారాత్మక వస్తువుగా తయారు చేసి విక్రయిస్తున్నారు.

నేడు కూడా ఆ చీపుర్ల అవసరాలు మాత్రం అలాగే వున్నాయి. గ్రామీణులు కూడా చీపుర్లను పట్టణాల నుంచి దిగుమతి చేసుకోవటం లేదా ఎవరైనా గ్రామాలకు వీటిని అమ్మే వ్యాపారులు వస్తే వారివద్ద తీసుకోవటం జరుగుతోంది. ప్రస్తుతం చీపుర్లు లారీలలో కూడా రవాణా అవుతున్న విషయం కొందరు చూసే వుంటారు. ఇంత పెద్ద యెత్తున చీపుర్లు తయారు చేయాలంటే తాటి ఆకునుండి ఈనెలను సేకరించడం మానవ శక్తితో సాధ్యమయ్యే పనేనా, ఒకవేళ అయినా ఆ ఖర్చు లెక్కవేస్తే చీపురు మనం కొనగలమా?

ఈ సమస్యకు కూడా పరిష్కారం కనుగొని ఒక యంత్రాన్ని తయారు చేశాడు మురళీకృష్ణ. కొన్ని వదుల మంది తాటి ఆకు నుండి ఈనెలను వేరు చేయటానికి అయ్యే కూలీల ఖర్చు, శ్రమ, సమయం అన్నీ ఆదా అయ్యేలా ఒక యంత్రాన్ని తయారు చేశాడు కేవలం ఒకే ఒక వ్యక్తి ఒక్క రోజులో కనీసం 50 మంది చేసే పనిని ఈ యంత్రంతో చెయ్య గలడు. ఈ విధం గా వేలాది రూపాయల ఖర్చును మిగిలేలా చేసిన మురళీకృష్ణ అభినందనీయుడు.

**పరికరం ద్వారా ఇనుప చువ్వను ఎక్కడ వంపు చెయ్యాలో అక్కడ కేవలం కొన్ని క్షణాలు (నిమిషాలు కూడా కాదు) వుంచితే ఎంత అవసరమో అంతగా వేడి అవుతుంది. అప్పుడు చువ్వను సులభంగా తనకు అనుగు ణంగా వంచేసుకోవచ్చు. దీనికి అయ్యే కరెంటు ఖర్చును కొలిమితో చేసే పనితో పోలిస్తే అందులో 10వ శాతం కూడా ఉండదు. అతి తక్కువ ఖర్చుతో, ఇనుప చువ్వ శక్తి క్షీణించకుండా, కావలసిన వంపులను సునాయాసంగా ఒక్కడే తయారు చేసుకుంటాడు**

మురళీకృష్ణ మదిలో ఇంకా ఎన్నెన్నో ఆలోచనలు సుడులు తిరుగుతునే వున్నాయి. ఎవ్వరు ఎటువంటి సమస్యను అతనితో చర్చించినా అతి తక్కువ ఖర్చుతో, ఎక్కువ సామర్థ్యం కలిగి వుండేలా దానికి అనుగుణమైన యంత్రాన్ని లేదా పరికరాన్ని తయారు చేసి ఇవ్వగ లిగిన "సామాన్య ఇంజనీర్" ఈ మురళీ కృష్ణుడు.

ఇతను చేసిన ఫ్లోటింగ్ ఫ్లడ్ పడవ పనితనాన్ని గుర్తించిన మరో కాంట్రాక్టర్ ఇన్నోవేటర్ ను కలిసి తన సమస్య చెప్పుకున్నాడు. ప్రస్తుతం ఇసుక చాలా అవసరం అయినదిగా మారింది. వర్షా కాలంలో ఇసుకను నదుల నుండి తీయటం సాధ్యం కాదు. అందుకే నదులు నీటితో నిండి వున్నా సరే అందులో నుండి జెసీబీతో ఇసుక తోడేలా నువ్వు ఇప్పుడు చేసిన పడవకన్నా ఇంకా సామర్థ్యం వున్నదాన్ని తయారు చెయ్యగలవా? అని అడిగాడు. తప్పకుండా చేస్తానని మురళీకృష్ణ అన్నాడట. దానిపైన ఇంకా చర్చలు జరుగుతున్నాయి. ఆ పడవ చేయటంలో ఇంకా జాగ్రత్త తీసుకోవాలి. ఎందుకంటే నదులలో ప్రవాహం కాలువల కన్నా చాలా ఎక్కువగా వుంటుంది. కాబట్టి దాని సాంకేతి కతనే వేరు అని, అయినా తప్పక తయారు చెయ్యగలను అంటున్నాడు మురళీకృష్ణ. ఇలాంటి పెద్దపెద్ద ఇంజనీరింగ్ సంస్థలు చేసే పనిని ఒక చిన్న వర్క్‌షాప్ యజమాని చెయ్యటం ఎంతో అభినందనీయం. మురళీ కృష్ణ ఇలాంటి ఇంకా ఎన్నో నవాళ్ళను ఎదుర్కొని నిలిచేలా పరికరాలు, యంత్రాలు తయారు చెయ్యాలని కోరుకుందాం.




ఇలాంటి వారి సృజనాత్మకతను వెలుగులోకి తీసుకు రావటానికి 'పల్లెసృజన' తనవంతు సహాయ సహకారాలను అందించి, ఇతని జ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చేందుకు తప్పక కృషి చేస్తుంది.

సాంకేతిక విజ్ఞానాన్ని సమానికి పనికి వచ్చేలా చేయటంలో ఎన్నో అవరోధాలు ఉంటాయి. యంత్రాలు వున్న విషయం వారికి తెలియాలి, అవి అందుబాటులో వుండాలి, ఆ తర్వాత సమయానికి చేరుకోవాలి. ఈ సందిగ్ధాల మధ్యన పని కావడం ఆలస్యమై నష్టాలు జరిగే అవకాశముంది.

మురళీకృష్ణ లాంటి అసామాన్య గ్రామ ఇన్నోవేటర్లు ఈ వెలితిని పూర్తి చేస్తారు. వీరిని ప్రోత్సహించడం వల్ల సమాజంలో సమయానికి పనవుతుంది. అంతేకాక ఇవి స్థానిక సాంకేతికతతో అందుబాటులో పరికరాలు వాళ్ళ మధ్యే లభిస్తాయి. వీరిని ప్రోత్సహించడం మనకు మనమే చేసుకున్న మేలు లాంటిది. ఇతడి జ్ఞానాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపుకు, దేశమంతా తెలియజేయటానికి, తద్వారా మురళీకృష్ణ ఇన్నోవేషన్లు పెద్దయెత్తున సరఫరా చేయటానికి 'పల్లెసృజన' తప్పక కృషి చేస్తుంది.

**ఇన్నోవేటర్ మురళీకృష్ణ, ఫోన్ : 9989703325**

# ఆయుర్వేద జ్ఞాన మథనం



## గాల్ బ్లాడర్ లో రాళ్ళ నిర్మూలన, 'సి' విటమిన్ ప్రాధాన్యత :

శరీరంలో లివర్ ప్రక్కనే గాల్ బ్లాడర్ (దీన్నే చేదు అంటారు) వుంటుంది. అందులో కూడా రాళ్ళు తయారు అవటం వల్ల రోగి ఎన్నో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. దీని లక్షణాలు కడుపు ఎప్పుడు ఉబ్బరంగా వున్నట్లు అనిపించటం, అజీర్తి అనిపించటం, తిన్న అన్నం అరగక పోవటం, ఉదరం కుడి వైపుకు బాగా నొప్పిగా వుండటం, అన్నం తిన్న తర్వాత కడుపు బరువుగా అనిపించటం, సాయంకాల సమయాల్లో జ్వరం వస్తూ వుంటుంది. పుల్లటి పదార్థాలు, నూనె ఎక్కువగా వున్న వంటలు తిన్నట్లయితే వాంతికి వచ్చినట్లుగా అనిపించడం, వాంతి అయ్యాక నొప్పి తగ్గినట్లు అనిపించటం, నోట్లో నీళ్ళు ఊరటం లాంటివి ఈ రోగ లక్షణాలు. కుడివైపు డొక్కలో ఎక్కువగా నొప్పి వున్నట్లయితే ఆసుపత్రికి వెళితే 'అల్ట్రా స్కానింగ్' చేయటం ద్వారా ఈ గాల్ బ్లాడర్‌లోని రాళ్ళ విషయం తెలుస్తుంది. ఇది కూడా కిడ్నీలలో రాళ్ళ లాగానే మనిషిని బాధ పెడుతూ వుంటుంది. కొన్ని ఆహార నియమాలు పాటించినట్లయితే ఇలాంటి పరిస్థితి నుండి ఉపశమనం పొందుతూ త్వరలో వ్యాధిని నివారించుకోవచ్చు.

గాల్ బ్లాడర్‌లో రాళ్ళు ఉన్నట్లు నిర్ధారణ అయిన వ్యక్తులు మాంసాహారం, గ్రుడ్లు, పుల్లటి పదార్థాలు, గోంగూర, బచ్చలి, చుక్క కూర, నువ్వులు, ఆవాలు, వేపుళ్ళు తినటం చాలావరకు తగ్గించుకోవాలి. ఈ రోగులు అధిక ప్రయాణాలు చేయ కూడదు. ఎందుకంటే ఇలాంటి వ్యక్తులు ఎక్కువ సేపు కూర్చొని ప్రయాణం చేయటం వల్ల పొత్తి కడుపు ఇంకా ఎక్కువ నొప్పి చేసే అవకాశం వుంటుంది. మల, మూత్రాలు వచ్చినప్పుడు వెంటనే వెళ్ళాలి. వాయిదా వేయటం మంచిది కాదు. ఈ వ్యాధి వున్న వారు పగటి పూట నిద్రించటం అలవాటు మానుకుంటే మంచిది. అతిగా వ్యాయామం చేయటం, అతిగా మాట్లాడం కూడా తగ్గించుకోవాలి.

ఇంట్లోనే వుండి కొన్ని చిట్కాలు పాటించటం ద్వారా గాల్ బ్లాడర్ లోని రాళ్ళను కరిగించుకోవచ్చు. ఈ వ్యాధి వున్న వారు 'నేతి బీర' కూరను ఎక్కువగా తీసుకుంటే మంచిది. తమలపాకుల సేవనం చేసినా లేదా అప్పుడప్పుడూ ఒక చెంచా తమలపాకుల రసం తీసుకుంటే మంచిది. బొప్పాయి పండు గింజలతో సహా తినాలి. దానిమ్మ, వెలగ, బూడిద గుమ్మడి, అనాస (పైనాపిల్) కూడా మంచివే. ఆహార పదార్థాల్లో అల్లం, శొంఠి ఎక్కువగా వాడుకోవటం మంచిది.

ఇలాంటి ఆహార నియమాలు పాటించి గాల్ బ్లాడర్ లోని రాళ్ళను తగ్గించుకోకుంటే అవి ఇంకా పెరిగి తీవ్ర ఇబ్బందులకు గురి చేసే అవకాశాలు వుంటాయి. ఈ వ్యాధి వున్న వారు అన్నం అరగక గ్యాస్ ట్రబుల్ లా అనిపించటంతో దానికి సంబంధించిన మందులు వాడుతూ వుంటారు. అయినా గ్యాస్ ట్రబుల్ తగ్గలేదెందుకు అనుకుంటూ వుంటారు. అందుకు కారణం గాల్ బ్లాడర్‌లోని రాళ్ళ సమస్యే అని గుర్తించండి.

దనియాలు, జీలకర్ర, వాము, దాల్చిన చెక్క లను సమ భాగాలుగా తీసుకుని, కొద్దిగా నేతిలో దోరగా వేయించి, అందులో కొద్దిగా సైంధవ లవణం వేసి మెత్తటి పొడి చేసి పెట్టుకోవాలి. ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం చేసేటపుడు అన్నం మొదటి ముద్దలో ఒక స్పూను పొడిని కలుపుకుని తిన్నట్లయితే గాల్ బ్లాడర్ లోని రాళ్ళు త్వరగా కరిగి పోయే అవకాశం వుంటుంది.

వాయు విడింగాలు అని ఆయుర్వేద షాపుల్లో లభిస్తాయి. వీటినే కొండ మిరియాలు లేదా తోక మిర్యాలని కూడా అంటారు. వాటిని తెచ్చుకొని పొడి చేసి పెట్టుకుని అన్నంలో కలుపుకుని తిన్నా కూడా కొంత వరకు ఉపశమనం పొందవచ్చు. భోజనంలో ఎక్కువ గా పాత బియ్యం, ముడి బియ్యం, ఉలవలు, అన్ని రకాల కాయ గూరలు తినాలి. మసాలాలు ఎక్కువగా వాడకూడదు. పలుచటి మజ్జిగ ఎక్కువగా తీసుకుంటూ వుంటే మంచిది. అందులో అల్లం, జీలకర్ర లాంటి వేసుకుని కూడా తీసుకోవచ్చు.

## శరీరానికి రక్షణ కవచం 'సి' విటమిన్ :

కడుపులో నొప్పి నుండి జలుబు వరకు చాలా రకాల రుగ్మతలకు కారణం 'సి' విటమిన్ లోపము. 'సి' విటమిన్ ఎక్కువగా వున్న ఆహార పదార్థాలు తీసుకుని పెంచుకున్నట్లయితే చాలా రకాల జబ్బుల నుండి దూరంగా వుండవచ్చు. ఇది ఎంత ఎక్కువగా శరీరం లో వుంటే అంత రోగ నిరోధక శక్తి మనకు వున్నట్లు అన్నమాట. 'సి' విటమిన్ తగ్గినప్పుడు రోగ నిరోధక శక్తి కూడా తగ్గే అవకాశం ఎక్కువ. ఇది తక్కువగా వున్నట్లయితే శరీరంలోకి రకరకాల క్రిములు, బ్యాక్టీరియా శరీరంపై దాడి చేసే అవకాశాలు ఎక్కువ.

సీజన్ వారిగా లభించే దాదాపు అన్ని రకాల పళ్ళలో 'సి' విటమిన్ ఎక్కువగానే వుంటుంది. కాబట్టి ఏ సీజన్‌లో లభించే పళ్ళను ఆ సీజన్‌లో తింటూ వుండటం మంచిది. ముఖ్యంగా జామ, టమోట, నారింజ, బత్తాయిలలో ఎక్కువగా వుంటుంది కాబట్టి వీటిని వీలైనంత ఎక్కువగా తీసుకుంటూ వుండాలి. 'సి' విటమిన్ ఎక్కువగా వుండటం వల్ల శరీరంలో క్రొవ్వును కూడా దూరంగా ఉంచుకోవచ్చు. ఒక గ్లాసు నారింజ రసం కాని, 4-5 ఉసిరి కాయలు తినటం కాని చేస్తూ వుంటే మంచిది. 'ఫ్లూ' వ్యాధి ఎక్కువగా వ్యాపించకుండా చేయగలిగేది 'సి' విటమిన్ మాత్రమే. వాతావరణం మారినప్పుడల్లా, గొంతు నొప్పి, జ్వరం, నస లాంటి వాటినుండి 'సి' విటమిన్ గల పదార్థాలు తినటం వల్ల సీజనల్ జబ్బుల నుండి దూరంగా ఉండవచ్చు. కాబట్టి 'సి' విటమిన్‌ను మీ శరీరంలో పెంచుకునేందుకు అనవసరంగా మాత్రలు వేసుకోవాల్సిన

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' ఉమామహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854**

**ఎడిటర్ గారికి,**

'పల్లెసృజన' లో "సమస్య – పరిష్కారం" పేరుతో సరికొత్త అంశాన్ని చేర్చడం మాకు ఎంతో ఆనందంగా వుంది. మా సమస్యలకు ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చూపే అవకాశాన్ని అందించటం చాలా మంచి విషయం.

ప్రస్తుతం వర్షా కాలం సందర్భంగా దోమలు విపరీతంగా పెరగటం ప్రకృతి ధర్మం. ఈ కాలంలో మనం (అంటే మనుషులం) వాటిని ఎదుర్కొనేందుకు దోమతెరలు, వివిధ రకాల పద్ధతుల ద్వారా దోమల బారిన పడకుండా కొంత వరకు కాపాడుకో గలుగుతున్నాం. కానీ పశువులు కూడా ఈ దోమల బారిన పడి నిదురలేని రాత్రులు గడుపుతున్న విషయం గమనిస్తే మాకు నిద్ర రావటం లేదు. రాత్రి ఎప్పుడు నిద్ర లేచి చూసినా పశువులు వాటి తోకలతో దూమలను తోలుకుంటూనే వుంటున్నాయి. శరీరంపై తోక అందని ప్రాంతాల్లో శరీరాన్ని కదిలించి కొంత వరకు కాపాడుకుంటున్నా, దోమ కాటుకు గురై పశువు శరీరంపై రక్తస్రావం కలిగిన భాగాలను చూస్తే కడుపు తరుక్కుపోతోంది. ఈ దోమల బారినుండి పశువులను కాపాడుకునే పరిష్కారం ఏదైనా వుందేమో తెలియజేస్తే మేమెంతో రుణపడి వుంటాము. దయచేసి వీలైనంత త్వరలో ఈ సమస్యను పరిష్కరించే ఉపాయాన్ని తెలియజేయ గలరు. **– కరమ్‌వీర్, కామారెడ్డి జిల్లా. ఫోన్ : 9951614772.**

**కరమ్‌వీర్ గారు,**

మీరు చెప్పిన వివరాలను వింటుంటే మాకు కూడా కడుపు తరుక్కుపోతోంది. దోమలను పారద్రోలే సమస్య ఎంత అత్యంత అవసరమో అర్థమవుతున్నది. ఇన్నోవేటర్ల ద్వారా ఈ సమస్యకు వీలైనంత త్వరలో పరిష్కారం కనుగొని మీకు తెలియజేయటంతో పాటు, పత్రిక ద్వారా యావత్ రైతాంగానికి తప్పక తెలియజేసేలా చేయాలని ప్రయత్నిస్తున్నాము. మీ సమస్యను మాతో పంచుకున్నందుకు ధన్యవాదములు. **– ఎడిటర్.**

**ఎడిటర్ గారికి,**

ఎప్పుడూ ఒకటే పంటలతో, అవి సరియైన దిగుబడి రాక, మంచి మార్కెట్ లేక సతమతమవుతున్న రైతాంగానికి 'పల్లెసృజన' నూతన వంగడాలైన రిచా-2000 కంది, సుల్కానియా సజ్జ, శ్రీరాం నువ్వుల విత్తనాలు అందించి ప్రోత్సహిస్తున్నందుకు ధన్యవాదములు. నేను మూడు రకాల విత్తనాలు వేయటం జరిగింది. కంది చాలా బాగా వస్తోంది. సుల్కానియా సజ్జ కంకులు చూస్తుంటే ముచ్చటేస్తోంది. నేను విత్తి ఇప్పటికి 50 రోజులు దాటింది. ప్రస్తుతం కంకులు 30 అంగుళాల పొడవున్నాయి. నా వయస్సు 60 సంవత్సరాలు. ఇంత పొడవైన కంకిని నేనింత వరకు చూడలేదు. వీటి దిగుబడి తలుచుకుంటేనే సంతోషం వేస్తోంది. మంచి దేశీ విత్తనాలను అందించిన మీకు కృతజ్ఞతలు. **– విజయభాస్కర రెడ్డి**, పులకుర్తి, కర్నూలు జిల్లా.

**విజయ భాస్కర రెడ్డి గారూ,**

మేము కూడా మీలాగే ఆలోచించి 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' వారి విత్తనాలను తెప్పించి మన రైతాంగానికి పరిచయం చెయ్యాలి అని సంకల్పంతో వీటిని తెప్పించటం జరిగింది. మీలాంటి రైతుల సంతోషం చూస్తుంటే మేము చేసిన సరియైనదే అని మాకు ధైర్యాన్ని ఇచ్చారు. ఇకనుండి అందరు రైతులు ఎవరికి వారు ఇలాంటి దేశీ విత్తనాలను అభివృద్ధి చేసుకుని పండించాలని, విత్తనాలను బయట నుండి కొనకుండా మీ విత్తనం మీరే అభివృద్ధి చేసుకుంటే మా సంకల్పం నెరవేరినట్టే. **– ఎడిటర్.**

**ఎడిటర్ గారికి,**

నేను గత సంవత్సరం 'రిచా-2000' కంది కొద్ది మోతాదులో విత్తడం జరిగింది. ఈ సంవత్సరం అర ఎకరంలోని మామిడి తోటలో చెట్ల మధ్యన అంతర పంటగా పెట్టాను. గత సంవత్సరం పండిన కందులను గుగ్గిళ్ళు (గుడాలుగా) ఉడికించుకుని తింటే పచ్చి కందికాయ ఉడికించుకొని తిన్నట్లుగా చాలా రుచిగా ఉన్నాయి. కంది పప్పు కూడా చాలా రుచిగా ఉంది. కంది పప్పు చాలా సందర్భాలలో ఉడకదు అంటారు, వాటిని కుక్కర్లలో పెట్టి ఉడికిస్తారు. మా ఇంట్లో వాళ్ళు నాతో రిచా కంది పప్పు దాదాపు అన్నం ఉడికినంత సమయంలోనే ఉడికిందని అన్నారు. దిగుబడి కూడా చాలా బాగా వస్తుంది కాబట్టి అందరు రైతులు రిచా కందిని విత్తుకో వలసిందిగా నేను సలహా ఇస్తున్నాను.

**– శ్రీనివాస్**, సహజ వ్యవసాయ రైతు, మంచిర్యాల జిల్లా. ఫోన్ : 9000338602.

# స్పందన

**శ్రీనివాస్ గారూ,**

రిచా కందిపై మీ అమూల్యమైన సమాచారం ఇచ్చినందుకు ధన్యవాదాలు. మీలాగే చాలా మంది రైతులు కూడా ఈ కంది పట్ల మంచి అభిప్రాయాలు వెలిబుచ్చటంతో ఈ సంవత్సరం ఈ పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వచ్చే సంవత్సరం ఈ కంది ఇంకా అభివృద్ధి చెంది ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వేలాది మంది రైతులు, లక్షలాది ఎకరాల్లో విత్తుకుంటారని ఆశిస్తున్నాము.

**– ఎడిటర్.**

**ఎడిటర్ గారికి,**

నేను రిచా–2000 కంది పంట 10 ఎకరాల్లో వేశాను. ప్రస్తుతం ప్రూనింగ్ దశకు వచ్చింది. అంటే మూడు అడుగులకు పైగా వుంది. గత సంవత్సరం వేసిన రైతు జగిత్యాలకు చెందిన ధనంజయ్ రెడ్డి గారు, 3 అడుగులు పెరింగిన తర్వాత ప్రూనింగ్ చెయ్యకుంటే రెమ్మలు లేకుండా ఎత్తుగా పెరుగుతుందని అన్నారు. కంది ప్రూనింగ్ చెయ్యాలంటే చాలామంది కూలీలు అవసరం ఎలా అనుకుంటున్న సమయంలో బ్యాటరీ స్ప్రేయర్‌కు అమర్చుకునే చిన్న పరికరం గురించి తెలుసుకుని తెచ్చుకున్నాను. దాని ధర కేవలం రూ. 650/- దీని ద్వారా 20–30 మంది చేసే పని ఒక్కడే సులభంగా చేయవచ్చు. ఈ విషయం మీ ద్వారా రైతులందరికీ తెలియజేస్తే బావుంటుంది అని మీకు తెలియజేస్తున్నాను. **– ధనుంజయ రెడ్డి, ఆదిలాబాద్.** ఫోన్ : 6301529952.

**ధనుంజయ రెడ్డి గారు,**

మీరు పంపిన పరికరం వీడియో చూశాను. మీరు అన్నట్లుగానే ఇది చాలా మంది రైతులకు వేలాది రూపాయల ఖర్చును మిగిల్చే పరికరం. దీనితో కేవలం కందిలోనే కాదు, ఎత్తు తక్కువగా వుండే దానిమ్మ లాంటి ఏ పంటలోలైనా ప్రూనింగ్ తక్కువ ఖర్చుతో చేసుకోవచ్చు. ఇలాంటి కొత్త పరికరాలను ఎప్పటికప్పుడు రైతులు ఒకరికి ఒకరు తెలియజేసుకోవటం ద్వారా అందరికీ మేలు జరుగుతుంది. మీకు మా అభినందనలు మరియు రైతులు అందరి తరుపున కృతజ్ఞతలు. **– ఎడిటర్.**


## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | **2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044.** |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

పల్లెసృజన
www.pallesrujana.org

# అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు



## పెట్రోల్ వీడర్

సామాన్య రైతులకు అందుబాటులో వుండే ఈ "పెట్రోల్ వీడర్" తో ఇక ప్రతి చిన్న రైతూ తన సేద్యాన్ని ఇతరులపై ఆధారపడకుండా చేసుకునే వీలుతో పాటు ఇతరులకు కిరాయికి అందిస్తూ ఉపాధి పొందవచ్చు. ఎటువంటి కుదుపులూ లేకుండా పని చేస్తుంది. పెట్రోల్‌తో నడిచే ఈ వీడర్‌ను తాడు గుంజటం ద్వారా స్టార్ట్ చెయ్యవచ్చు. దీనితో పాటు గొర్రు, గుంటక, ఒక నాగలి ఇవ్వబడును. మొక్కజొన్న, వేరుశనగ పైర్లలో కూడా అంతర సేద్యంతో పాటు ఎరువులు, విత్తనం కూడా వేచుకోవచ్చు. ఒక్క అడుగు నుండి రెండున్నర అడుగుల వెడల్పు వరకు అంతర సేద్యాలు చేసుకోవచ్చు. ఒక హెక్టారు పొలాన్ని రెండున్నర గంటల్లో కేవలం రెండు లీటర్ల పెట్రోల్‌తో సేద్యం చేయవచ్చు. అన్ని రకాల పండ్ల తోటల్లో చెట్ల చుట్టూ పాదులలో కలుపు తీయటానికి అనువైనది. ఇది 6.5 హార్స్‌పవర్ ల శక్తిగల ఇంజన్.

## సులభంగా నారు నాటే పరికరం క్విక్ ప్లాంటర్



నర్సరీనుంచి సేకరించిన మొక్కలు భూమిలో త్వరగా, ఒకే లోతులో నాటడానికి ఉపయోగపడేదే "క్విక్ ప్లాంటర్". మల్చింగ్ పద్ధతిలో 30 మంది చేసే పనిని, మల్చింగ్ లేకుండా 20 మంది చేసే పనిని ఈ క్విక్ ప్లాంటర్‌ను వినియోగిస్తే ముగ్గురు మనుషులతో చేయవచ్చు. దీని వలన మొక్కలు పాడవకుండా బలంగా నాటబడి ఆరోగ్యంగా పెరుగుతాయి. ఈ పరికరం ప్రత్తి, టమోట, మిరప, వంకాయ లాంటి చిన్న మొక్కలు నాటడానికి అద్భుతంగా ఉపయోగ పడుతుంది.

## పోర్టబుల్ పంపుసెట్



వర్షాభావ పరిస్థితుల్లో నీటి యెద్దడి నుండి పంటను కాపాడుకునేందుకు పొలాల్లో మొక్కలకు నీరు పోయటానికి, గృహ నిర్మాణాల్లో 'క్యూరింగ్' చేయటానికి, ఇతర అవసరాలకు ఎంతో అనువైనది ఈ పోర్టబుల్ పంపుసెట్. పెట్రోలు సహాయంతో పని చేస్తుంది. 50 అడుగుల లోతునుండి నీటిని లాగి, 500 అడుగుల దూరం సునాయాసంగా నీటిని తోడగలదు. తక్కువ బరువున్న ఈ పోర్టబుల్ పంపుసెట్ ఎక్కడికైనా వెళ్ళేందుకు ఎంతో అనువైనది.

## వాడిన కేబుల్ నుంచి లోహపు తీగను తీసే యంత్రం



వ్యర్థంగా పడివున్న వైర్లలోనుండి లోహపు తీగలను వేరుచేసి విక్రయించుకునే వ్యాపారులకు ఆ తీగలను తీసేందుకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన తీగలను వెలికి తీసేందుకు అత్యంత అనువైనది ఈ యంత్రం. కూలీల ఆదాతో పాటు అధిక ఆదాయాన్ని కూడా సమకూరుస్తుంది. వైర్లను కాల్చటం వల్ల ఏర్పడే వాతావరణ కాలుష్యం నుంచి పర్యావరణాన్ని కాపాడుతుంది.


పరికరాలు కావలసిన వారు సంప్రదించండి :

బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700

PALLE SRUJANA Telugu Bi-monthly July-August 2021 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే


























పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023

లేదా

PhonePe

Pay by "Phone Pe" to 9866 00 1678

'ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9866 00 1678 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

## చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,000/- |

Narendra Grafix. Ph.: 8125799904